# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
సోమవారం
14-10-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 293
పేజీలు : 8

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa




## ముప్పు వాటిల్లితే తగ్గేదేలే..

### శత్రు దేశాలకు భారత్ హెచ్చరిక?

### రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**కోల్‌కత్తా, అక్టోబర్ 13 :** భద్రత విషయంలో భారత్ రాజీపడదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దసరా సందర్భంగా అన్నారు. ఏ దేశమైనా భారత్ ప్రయోజనాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత్ వెనకాడబోదని అన్నారు. పశ్చిమ బెంగాల్లోని సుక్నా మిలటరీ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. భారత దేశం ఏ దేశంపైనా మిగతా 5లో...



## మూడు ఆఫ్రికన్ దేశాల పర్యటనకు రాష్ట్రపతి ముర్ము

ఇరు దేశాల అధ్యక్షుల మధ్య ద్వైపాక్షిక చర్చలు..

భారతదేశం- అల్జీరియా మధ్య ఆర్థిక వేదికపై ప్రసంగం..

మలావి అగ్రనేతలతో సమావేశం

5

# ధూంధాంగా..

# అలయ్ బలయ్ సందడి

### రాష్ట్ర సాధనకు 'అలయ్ బలయ్' స్ఫూర్తి.. : సీఎం

జేఏసీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది

దీనికి రాజకీయాలకు సంబంధం లేదు

19 ఏండ్లనుంచి దిగ్విజయంగా నిర్వహిస్తున్నరు

దత్తన్న వారసత్వాన్ని కొనసాగిస్తున్న విజయలక్ష్మికి అభినందనలు

కుల, మత, పార్టీలకతీతంగా ప్రతిఏటా పాల్గొనాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

సీఎంను గొంగళి, కర్రతో సన్మానించిన బండారు దత్తాత్రేయ





హాజరైన ఉపరాష్ట్రపతి, గవర్నర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు

వివరాలు 2లో..



## రైతులకు ఇచ్చిన మాట తప్పబోం..

రూ.2లక్షలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఇందిరమ్మ రాజ్యం కోసం కలలుగన్న ప్రజలు

మంత్రి పొంగులేటి

పామాయిల్ సాగుకు అనువుగా అశ్వారావుపేట

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**అశ్వారావుపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** 15 రోజుల్లో 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి 2 లక్షల రూపాయల రుణమాఫీ చేసిన చరిత్ర దేశంలో తెలంగాణకు మాత్రమే ఉందని, రాజకీయాలకతీతంగా తర తమ భేదం లేకుండా అర్హత కలిగిన ప్రతి రైతు ఖాతాలో ఒకేసారి రైతు రుణమాఫీ చేసి డబ్బులు జమ చేశామని డిప్యూటీ సీఎం మిగతా 2లో...

## పట్నం మహేందర్‌ది ఏ పార్టీ?

మండలి చీఫ్ విప్‌గా మహేందర్ రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధం

పదవి ఎలా ఇచ్చారు..?

చిట్‌చాట్‌లో హరీష్ రావు



**హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్):** బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పట్నం మహేందర్ రెడ్డికి చీఫ్ విప్ పదవి ఎలా ఇస్తారు? అని ప్రశ్నించారు మాజీ మంత్రి హరీశ్‌రావు. ఆదివారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన హరీష్ రావు.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీని చేర్చుకుని చీఫ్ విప్ పదవి ఇవ్వటం రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పట్నం మహేందర్ రెడ్డికి చీఫ్ విప్ పదవి ఎలా ఇస్తారు?.అనర్హత వేటు వేయాల్సిన కౌన్సిల్ ఛైర్మన్ స్వయంగా .. పట్నం మహేందర్ రెడ్డి చీఫ్ విప్ ఎంపికైనట్లు బులెటిన్ ఇవ్వటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. పట్నం మహేందర్ రెడ్డి అనర్హత పిటిషన్ కౌన్సిల్ ఛైర్మన్ దగ్గర పెండింగ్‌లో ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి హాయాంలో రాజ్యాంగం ఎలా ఖూనీ జరుగుతుందనే దానికి ఇదొక ఉదాహరణ. పీఏసీ ఛైర్మన్ పదవి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇలానే వ్యవహరించింది. అరికెపూడి గాంధీ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అని స్వయంగా సీఎం, మంత్రులు చెప్పారు.. పట్నం మహేందర్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తి? ప్రభుత్వం చెప్పాలని' హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మహేందర్ రెడ్డికి చీఫ్ విప్ పదవి ఎలా ఇచ్చారు..? ఆయనపై ఛైర్మన్ వద్ద ఇప్పటికే అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఛైర్మన్ ఇచ్చిన బులెటిన్ మిగతా 2లో...

## కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి..

ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే..

ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం

**హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్):** కలుషిత తాగునీరు తాగి సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు మరణించిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థతపై మండిపడ్డారు. తెలంగాణ అంతటా తాగునీరు సరఫరా చేయడానికి కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మిషన్ భగీరథ ప్రాజెక్టు పూర్తి చేసిం దని తెలిపారు. కృష్ణా, గోదా వరి నదీ జలాలను శుద్ధి చేసి



రాష్ట్రమంతటా తాగు నీరు ఇచ్చే ఈ ప్రాజెక్టును కూడా రేవంత్ సర్కార్ సరిగ్గా నిర్వహించలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజీవన్‌రావుపేటలో కలుషిత నీటి సరఫరా మిగతా 2లో...

## మాజీ ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత..

నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి

ఆయన మరణం తీరని లోటు

పార్టీల నేతలు, పలువురు ప్రగాఢ సానుభూతి

సాయిబాబా భౌతిక కాయాన్ని ప్రభుత్వ గాంధీ ఆసుపత్రికి అప్పగిస్తాం..

కుటుంబ సభ్యుల ప్రకటన



**హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్):** ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా కన్నుమూశారు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయిబాబా తుది శ్వాస విడిచారు. ఉద్యమకారుడిగా, రచయితగా, విద్యావేత్తగా పేరు తెచ్చుకున్నారు. అయితే మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని 2014లో సాయిబాబాను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. 2017లో జీవిత ఖైదు విధించిన గడ్చిరోలి కోర్టు.. నాగపూర్ జైల్లో శిక్ష అనుభవించారు. అనంతరం బాంబే హైకోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సాయిబాబా శనివారం నిమ్స్‌లో చికిత్స పొందుతూ మిగతా 2లో...

## కులగణన తర్వాతే.. స్థానిక సంస్థల ఎన్నికలు

60 రోజుల్లో పూర్తి

అభివృద్ధిలో హుస్నాబాద్‌ను నెం.1గా నిలుపుతా

గౌరవెల్లి ఈప్రాంత ప్రజల గుండెకాయ

నిరుపేదల కోసం 3500 ఇండ్లు

ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత నిర్మించుకోవాలి

వైద్య పరంగా త్వరలోనే గుడ్‌న్యూస్: మంత్రి పొన్నం



**హుస్నాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్):** కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ స్పష్టం చేసారు. పట్టణ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం దసరా (జమ్మి) వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ బీసీ కమిషన్ విజ్ఞప్తి మేరకు సొంతంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ లేనందున వారికి కావాల్సిన సమాచారాన్ని బీసీ కుల సర్వే అయినా తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు. కోర్టుకు ఇచ్చిన వాయిదా ప్రకారం కులగణన సర్వే ప్రారంభమయ్యింది. 60 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయగానే స్థానిక సంస్థల ఎన్నికలు ఈ దామాషా ప్రకారం జరుగుతాయి అన్నారు. కులగణన సర్వే మిగతా 2లో...

## హరీశ్.. మీకిది తగదు

ఉల్లంఘనలు జరగలేదు: మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్):** తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ సహా, ఇతర నియామకాలు రాజ్యాంగ బద్ధంగానే జరిగాయని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎక్కడా ఉల్లంఘనలు జరగలేదన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. కేసీఆర్ హయాంలో హరీశ్‌రావు శాసనసభ వ్యవహారాల మంత్రిగా ఉన్న సమయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని, అప్పుడు రాజ్యాంగం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిగా భారాసలో చేర్చుకున్నారని విమర్శించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మండలి ఛైర్మన్, సభాపతి నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు.



సంప్రదాయం ప్రకారమే ప్రతిపక్ష సభ్యుడికి పీఏసీ ఛైర్మన్ పదవి ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. అనర్హత పిటిషన్ల అంశం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు. మండలి చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని ఎలా నియమించారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించిన సంగతి తెలిసిందే. రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ అని ఆయన అన్నారు. పీఏసీ ఛైర్మన్ విషయంలో కూడా ఇలాగే వ్యవహరించారని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు.



## మాజీ మంత్రి బాబా సిద్దిఖీ దారుణ హత్య..

దసరా బాణసంచా పేలుళ్ల మధ్య సిద్ధిఖీపై కాల్పులు

బాబా సిద్ధిఖీని చంపింది మేమే

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సంచలన ప్రకటన..

**ముంబై/న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** ఎన్సీపీ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్య పక్కా ప్లానింగ్‌తోనే జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కాంట్రాక్ట్ హత్య కావచ్చునా, వ్యాపారంలో శత్రుత్వమే కారణమా, స్లమ్ రిహాబిలిటేషన్ ప్రాజెక్టు మిగతా 2లో...

## కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

మొదటి పేజీతరువాయి...

రాజకీయాలకు అతీతంగా బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరగడానికి అందరూ సహకరించాలన్నారు. సమాజంలో కొలమానంగా ప్రభుత్వాలు పని చేయడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. జీవో 18తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులకి సంబంధించి సర్వే చేయడానికి జీవో 18 విడుదల చేసిందని ప్రకటించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం శాసనసభలో కులగణన చేస్తామని తీర్మానం చేసామని గుర్తు చేసారు. రాష్ట్రంలో 28 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భూమి పూజ జరిగితే సీఎం, డిప్యూటీ సీఎం తర్వాత హుస్నాబాద్‌ది మూడోది అన్నారు. గతంలో బతుకమ్మ కార్యక్రమాల్లో సర్పంచ్, ఎంపీటీసీలు ఉన్నా ఇబ్బందులు ఉండేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని జిల్లా అధికారులు, స్థానిక ముఖ్యులు, సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్, బతుకమ్మ వేడుకల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసారని కొనియాడారు. హుస్నాబాద్ పట్టణానికి రూ.28 కోట్లు నిధులు తీసుకువచ్చాం అన్నారు. ప్రతి వార్డులో రూ.50 లక్షలతో సీసీ రోడ్డులకు ఫౌండేషన్ వేసుకోవాల్సి ఉందన్నారు. అన్ని కుల సంఘాలకు రూ.45 లక్షలు, పందిల్ల నుండి ఎల్లమ్మ చెరువు వరకు రూ.3 కోట్లు, సెంట్రల్ ఎలివేషన్ ఎల్లమ్మ చెరువుకి రూ.30కోట్లు మొదటి దశలో రూ.20కోట్లు వచ్చాయి అన్నారు. సర్వాయి పాపన్న కోటకి రూ.4కోట్లు, రాయికల్ వాటర్ పాల్స్‌ను టూరిజంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎక్కడ వరద వచ్చినా ఇండ్లలోకి నీళ్లు రాకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇంకుడు గుంతలు అవుతున్నాయో ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు కట్టుకోవాలని వర్షం నీరు ఒడిసి పట్టే విధంగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అక్కన్నపేటలో ఇండస్ట్రియల్ పార్క్‌ను తీసుకువస్తున్నాం అన్నారు. హుస్నాబాద్‌లో జంక్షన్ల అభివృద్ధి..విద్యా, వైద్యం ఉపాధి అవకాశాల్లో హుస్నాబాద్‌ను మరింత ముందుకు తీసుకుపోతాం అన్నారు. ఇందిరమ్మ కమిటీలను ఐదుగురు సభ్యులతో వేస్తున్నామన్నారు. ఈ నియోజకవర్గానికి 3500 ఇండ్లు వచ్చాయన్నారు. అవి రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు మాత్రమే ఇస్తామని స్పష్టం చేసారు. అభివృద్ధిపై ఇప్పటికే అధికారులతో పలు సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసామన్నారు. త్వరలోనే పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతామన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు దసరా పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనం నడపను అని ట్రాఫిక్ రూల్స్ పాటిస్తామంటూ కాంగ్రెస్ నాయకులతో మంత్రి పొన్నం ప్రమాణం చేపించారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డిసిసి కార్యదర్శి చిత్తారి రవీందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, అక్కన్నపేట మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు, సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు డా.అక్కు శ్రీనివాస్, కౌన్సిలర్లు భూక్య సరోజన, కోమటి స్వర్ణలత, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.





# ధూంధాంగా..

**తెలంగాణ సంస్కృతి నలు దిశలా వ్యాపించడానికి, మనమంతా ఒక్కటే అనే సందేశం ఇయ్యడానికి 'అలయ్ బలయ్' గొప్ప వేదిక.. నాడు రాష్ట్ర సాధన కోసం పొలిటికల్ జేఏసీ ఏర్పాటుకు, సకల జనులు ఉద్యమంలో కార్యోన్ముఖులు కావడానికి కూడా అలయ్ బలయ్ ఒక కారణమని గుర్తు చేశారు ముఖ్యమంత్రి..**

**హైదరాబాద్, అక్టోబర్ 13 (మనం న్యూస్):** హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమంలో అందరూ ఒక తాటికి వచ్చి కలిసి పని చేసేందుకు ఉపయోగపడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అలయ్ బలయ్ స్ఫూర్తితోనే తెలంగాణ జేఏసీ ఏర్పాటు అయిందని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు రాజకీయ నాయకులు విడివిడిగా ఎవరికీ వారు కార్యక్రమాలు నిర్వహించుకునే వారని తెలిపారు. కానీ అలయ్ బలయ్తొ గవర్నర్ దత్తాత్రేయ అందర్నీ ఒక తాటిపైకి తీసుకు వచ్చారన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలయ్ బలయ్ కార్యాక్రమం తెలంగాణ సంస్కృతిని కాపాడే మంచి కార్యక్రమం అని ఆయన అభివర్ణించారు. గత 19 ఏళ్ళ నుంచి ఈ కార్యక్రమాన్ని గవర్నర్ బండారు దత్తాత్రేయ నిర్వహిస్తున్నారన్నారు. ఈ అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించటం నిజంగా అభినందనీయమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి సంబంధించిన కార్యక్రమం కావడంతో కాంగ్రెస్ పార్టీలోని నేతలమంతా తరలివచ్చినట్లు సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణ ప్రజలకు అతిపెద్ద పండగ దసరా అని చెప్పారు. ఈ పర్వదినాన గుర్తొచ్చేది పాలపిట్ట, జమ్మిచెట్టు అన్నారు. 'అలయ్ బలయ్' అంటే గుర్తొచ్చేది బండారు దత్తాత్రేయ అని చెప్పారు. ఆయన నుంచి వారసత్వంగా తీసుకొని విజయలక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడానికి 'అలయ్ బలయ్' స్ఫూర్తిగా పనిచేసిందని చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా దీన్ని నిర్వహిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. దత్తాత్రేయ.. తెలంగాణ సంస్కృతిని కాపాడేలా కృషి చేస్తున్నారని కొనియాడారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరై.. మాట్లాడుతూ..'స్నేహశీలి బండారు దత్తాత్రేయ. భావితరాలకు ఈ కార్యక్రమాన్ని అందించాలి. పండగలకి సామాజిక సంస్కృతి అంతే ఉంది. కలిసి మెలిసి ఉండాలన్న సంకల్పం ఈ అలయ్ బలయ్. కుటుంబ, ప్రాంత, దేశ సమైక్యత సాధించుకోవాలి. పాశ్చాత్య సంస్కృతి వదిలి పెట్టి మన అనుకునే ఐక్యత పద్దతి పాటించాలి' అని అన్నారు.

మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు మాటాడుతూ.. అలయ్ బలయ్ రాజ్యాంగ పీఠికలోని సౌభ్రాతృత్వానికి ప్రతీక. పలు రాష్ట్రాల గవర్నర్ల రాకతో దేశమంతా దిగివచ్చినట్లు ఉంది. అలయ్ బలయ్‌ను హైదరాబాద్‌తో జిల్లాలకు, ఆంధ్రప్రదేశ్‌కు కూడా విస్తరించాలి' అని అన్నారు.

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. 'రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసిమెలిసి ఉండాలి. అభివృద్ధిలో తెలుగురాష్ట్రాలు దేశంలో నెంబర్ వన్‌గా నిలవాలి' అని అన్నారు.

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ.. 'అలయ్ బలయ్ అంటే ఐక్యత. మన సాంప్రదాయలను ప్రతిబింబించే కార్యక్రమం. తెలంగాణ గ్రామీణ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో సుందరమైనవి. అందరూ కలిసుండాలనేది మన సంస్కృతి. అన్ని మతాల వారు కలిసి విజయదశమి జరుపుకుంటున్నారు. విజయదశమి పర్వదినం చెడుపై మంచి సాధించిన విజయం. ఆ విజయం ఐక్యతతో సాధ్యం' అని అన్నారు.

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 'అన్ని వర్గాల వారిని ఐక్యం చేసే అలయ్ బలయ్ గొప్ప కార్యక్రమం. రాజకీయంగా ఎన్ని ఉన్నా ఇలాంటి ప్రోగ్రాంలలో కలవడం గొప్ప విషయం. ఎన్నికలప్పుడు రాజకీయాలు, తర్వాత పేద ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టాలి. కానీ ప్రస్తుతం తెలంగాణలో అది లోపించింది. గత కొన్నేళ్లుగా రాజకీయ పార్టీల మధ్య మాటలతో మాట్లడలేని విధంగా విమర్శించుకుంటున్నారు. వాళ్లలో మార్పు రావాలని దసరా సందర్భంగా దేవుళ్లను కోరుకుంటున్నా. మాట్లాడే భాష అంగీకారం కాదు. మార్పు రావాలి. రానున్న రోజుల్లో ప్రజలు అసహించుకునేలా మాట్లాడం రాజకీయ నాయకులకు తగదు' అని అన్నారు. ఈ అలయ్ బలయ్ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ, ఉత్తరాఖండ్ గవర్నర్, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్‌తోపాటు వివిధ పార్టీలకు చెందిన నేతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, రఘునందనరావు తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, వీహెచ్, కేకేలు విచ్చేశారు. బీఆర్ఎస్ నుంచి తలసాని, శ్రీనివాసగౌడ్, స్వామిగౌడ్ వచ్చారు. ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, ఆర్.కృష్ణయ్యలు హాజరయ్యారు. అలాగే ఏపీ మంత్రి సత్యకుమార్ సైతం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## మాజీ ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత..

మొదటి పేజీతరువాయి...

ప్రాణాలు విడిచారు. సాయిబాబా మృతి పట్ల ప్రజాసంఘాల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఢిల్లీ యూనివర్సిటీలో సాయిబాబా ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పని చేశారు. సాయిబాబాను 2014లో మావోయిస్టు గ్రూపులతో సంబంధాలున్నాయనే అనుమానంతో మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసిన తర్వాత యూనివర్సిటీ నుంచి సస్పెండ్ అయ్యారు. నాగ్‌పూర్ సెంట్రల్ జైలులో నిర్బంధించారు. మార్చి 2017లో మహారాష్ట్ర సెషన్స్ కోర్టు సాయిబాబాకు మరో ఐదుగురు మావోయిస్టులు మహేష్ తిర్కీ, పాండు నరోటే, హేమ్ మిశ్రా, ప్రశాంత్ రాహి, విజయ్ టిర్కీతో సంబంధాలు ఉన్నాయని తేల్చింది. దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నట్లు భావించే కార్యకలాపాలలో పాల్గొన్నందుకు దోషులుగా నిర్ధారించింది. జైలు శిక్ష అనుభవిస్తున్న సాయిబాబాకు ఈ ఏడాది మార్చి 5న బాంబే హైకోర్టు నిర్దోషిగా ప్రకటించడంతో విడుదలయ్యాడు.

### ప్రభుత్వ గాంధీ వైద్య కళాశాలకు ప్రొ. సాయిబాబా భౌతిక శరీరం దానం

ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా(58) పార్థివ శరీరాన్నిఆయన కుటుంబ సభ్యులు ఇక్కడి ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌కు దానం చేశారు. ఆయన కోరుకున్న విధంగానే ఆయన శరీరాన్ని దానం చేస్తున్నట్లు వారు తెలిపారు. నేడు ప్రభుత్వ గాంధీ మెడికల్ కాలేజ్‌కు ఆయన భౌతిక కాయాన్ని అందజేయనున్నట్లు వారు తెలిపారు. ప్రొ. సాయిబాబా ఆపరేషన్ అయ్యాక తలెత్తిన సమస్యల కారణంగా మరణించారు. మావోయిస్టులతో సంబంధం ఉందన్న కేసులో ఆయన ఏడు నెలల కిందట విడుదలయ్యారు. ప్రస్తుతం ఆయన భౌతిక కాయం నిమ్స్ మార్చురీలో ఉంచారు. నేడు గన్ పార్క్‌కు తీసుకెళతారు. అక్కడి నుంచి ఆయన సోదరుడి ఇంటికి తరలిస్తారు. అక్కడ ప్రజలు ఆయనకు నివాళులు ఇవ్వడానికి ఉంచుతారు. తర్వాత సంతాప సమావేశం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయిబాబా గాల్ బ్లాడర్ ఇన్ఫెక్షన్ తో బాధపడ్డారు. రెండు వారాల కిందటే ఆయనకు ఆపరేషన్ జరిగింది. కానీ తర్వాత సమస్యలు తలెత్తాయి. చివరికి ఆయన కన్నుమూశారు. ప్రొఫెసర్ సాయిబాబాకు భార్య, కూతురు ఉన్నారు. తన భౌతిక కాయాన్ని దానం చేయాలని ఆయన ఎన్నడూ కోరుకునేవారు. ఇప్పటికే ఆయన కళ్లను ఎల్‌వి ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు దానం చేశాము. ఆయన భౌతిక కాయాన్ని కూడా నేడు హాస్పిటల్‌కు అందజేస్తాం'' అన్నారు ఆయన కూతురు మంజీర.

### చూపిన ధైర్యసాహసాలు చిరస్థాయిగా నిలుస్తాయి..

ప్రొ సాయిబాబా మృతిపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం పౌర హక్కుల ఉద్యమానికి తీరని లోటని అన్నారు. అణగారిన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించారని చెప్పారు. వ్యక్తిగత స్వేచ్ఛకు, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లినా అవిశ్రాంతంగా పోరాడారని పేర్కొన్నారు. పౌర హక్కులను కాపాడే క్రమంలో సవాళ్లు ఎదురైనా సాయిబాబా చూపిన ధైర్యసాహసాలు చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. సాయిబాబాను కోల్పోవడంతో తీవ్ర విషాదంలో ఉన్న ఆయన కుటుంబసభ్యులు, సన్నిహితులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### కేంద్రం కుట్రలకు బలి..

ప్రొ సాయిబాబా మృతి పట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా దేశద్రోహ నేరం మోపి 90 శాతం అంగవైకల్యంతో ఉన్న సాయిబాబాను ఉపా చట్టం కింద సుదీర్ఘ కాలంగా జైలులో నిర్బంధించిందని ఆయన మండిపడ్డారు. ఆయనపై బీజేపీ అర్బన్ నక్సలైట్గా ముద్రవేసిందని అన్నారు. సాయిబాబా జైలులో ఉండగా అనేక సార్లు అనారోగ్యానికి గురయ్యారని.. ఆయనకు సరైన వైద్య సదుపాయాలు కూడా అందించలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయిబాబా.. దళిత, గిరిజన, వికలాంగుల హక్కుల నేతగా, విద్యావేత్తగా పేరు పొందారని కొనియాడారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.

### తీరనిలోటు..

సాయిబాబా మృతి తీరని లోటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు అన్నారు. వారి కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు.

# రైతులకు ఇచ్చిన మాట తప్పబోం..

మొదటి పేజీతరువాయి...

మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆయిల్ ఫామ్ కర్మాగారం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న గత బిఆర్ఎస్ లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తానని చెప్పి చేయకపోగా ఒకేసారి రెండు లక్షల రూపాయలను రుణమాఫీ చేసిన ప్రజా ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తున్న బిఆర్ఎస్ పై 18 వేల కోట్ల రూపాయల లబ్ధి పొందిన రైతులు గొంతు విప్పి బుద్ధి చెప్పాలన్నారు. ఆధార్ కార్డు నెంబర్లు, రేషన్ కార్డు వివరాలు సరిగ్గా లేకుండా అర్హత ఉండి రుణమాఫీ కానటువంటి రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలి సూచించారు. రైతులు చెల్లించాల్సిన పంట బీమా ప్రీమియాన్ని ప్రజా ప్రభుత్వమే రైతుల తరఫున ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించిందని తెలిపారు. రైతు బీమాను కొనసాగిస్తున్నాం. రైతుల పక్షాన ప్రీమియం డబ్బులను ప్రజా ప్రభుత్వమే భీమా కంపెనీలకు చెల్లించిందని మరోసారి గుర్తు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరదల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి క్షేత్రస్థాయిలోకి అధికారులు పంపించి పంట నష్టం అంచనా వేయిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి కాబట్టే బడ్జెట్లో ఎన్నడు లేని విధంగా వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ 73 వేల కోట్ల రూపాయలను కేటాయించటం జరిగిందన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఈ ఖరీఫ్ సీజన్లో వచ్చే వరి సన్న ధాన్యానికి మద్దతు ధర ఇవ్వడంతో పాటు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని రైతులకు తెలిపారు. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న గత బిఆర్ఎస్ పాలకులు రైతులకు ఏనాడూ గిట్టుబాటు ధర ఇవ్వలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతు సోదరులకు 10 సంవత్సరాల కాలంలో ఏనాడు పరిహారం బిఆర్ఎస్ ప్రభుత్వం అందివ్వలేదన్నారు. వచ్చే ఐదారు సంవత్సరాల్లో రాష్ట్రంలో 20వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ను ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు పోతున్నామన్నారు. ప్రకృతి వనరులతో లభించే విద్యుత్ ను ఉత్పత్తి చేసి తెలంగాణ ప్రజల అవసరాలు తీర్చడానికి న్యూ ఎనర్జీ పాలసీని తీసుకు రావడానికి ప్రజా ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. రైతులకు పంటతోపాటు పవర్ తో ఆదాయం వచ్చే విధంగా సోలార్ విద్యుత్ పంపు సెట్లను రూపకల్పన చేశామని తెలిపారు. రాష్ట్రంలో కొన్ని గ్రామాలను సోలార్ విద్యుత్ గ్రామాలుగా మార్చడానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపీగా చేశామని, అశ్వరావుపేట నియోజకవర్గం నుంచి రెండు గ్రామాలను ఎంపిక చేస్తామని తెలిపారు. రైతుల పొలాల మీదుగా వెళ్లేటువంటి విద్యుత్తు లైను షిఫ్ట్ చేసుకోవడానికి అధికారులకు దరఖాస్తు పెట్టుకుంటే వారి పర్యవేక్షణలో లైన్ మార్చుకోవచ్చన్నారు. ఫామ్ ఆయిల్ సాగు పంట కేవలం అశ్వరావుపేటలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సూచించారు.

1990 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హయాంలో హార్టికల్చర్ సాగులో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడి నుంచి మలేషియా కు ఒక బృందాన్ని పంపించిందని, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఖమ్మం జిల్లాలో ఉన్న అశ్వరావుపేట లో ఆయిల్ ఫామ్ సాగుకు శ్రీకారం చుట్టారని తెలిపారు.

ఆనాటి కాంగ్రెస్ పాలకుల ముందు చూపు వల్లనే ఈరోజు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులకు మేలు జరగాలన్న ఆశ, ఆకాంక్షతో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫామ్ కర్మాగారం విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నానన్నారు. వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ 1986లో ఎన్టీఆర్ పెదవేగిలో మొక్క నాటారని 1990 తర్వాత తెలంగాణలో వేశామని అన్నారు. హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో పామాయిల్ సాగుకు అనుమతులు వచ్చాయని తుమ్మల తెలిపారు.

రైతులకు లాభం కుర్చేందుకు టన్ను ఇరవై వేలు ధర ఉండేలా దృష్టి పెడతాంఅని అన్నారు. అవసరమైతే రాష్ట్రాల అధినేతలతో కలిసి కేంద్రం దగ్గరకి వెళ్లి పామాయిల్‌కు వచ్చే నెలలో మరో 13 వందలు ధర పెరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. రాహుల్ గాంధీ సారథ్యంలో 20 వేలు కంటే ఎక్కువ వచ్చేలా ప్రణాళిక చేసుకుందామని రైతులకు ఊతమచ్చారు. కొత్తగూడెం జిల్లాలో పట్టా ట్రాన్స్ఫర్ లు ఉండవు గనుక భూమి ఉన్న ప్రతి రైతుకు పామాయిల్ మొక్క అందేలా రెవెన్యూ మంత్రి చర్యలు తీసుకోనేలా మాట్లాడుతానన్నారు. ఆంధ్రా లో నర్సరీ లకు విద్యుత్ పరంగా ఉన్న విధి విధానాలు అశ్వారావుపేట నర్సరీలకు ఇవ్వాలని విద్యుత్ శాఖను కోరారు. అన్నమాట ప్రకారం రైతు భరోసా ఇచ్చే ఏర్పాటు చేసామని, తల తాకట్టు పెట్టి అయినా పంట భీమా పథకం ఇప్పిస్తామని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు, మట్ట రాగమయి, ఎంపీ బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, ఆయిల్ పెడ్ అధికారులు, పామాయిల్ రైతు సంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీరు తాగి ఇద్దరు మృతి..

మొదటి పేజీతరువాయి...

వల్ల జరిగిన మరణాలు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలను ఆదుకోవాలని, చికిత్స పొందుతున్నవారికి తగిన సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దురదృష్టకరమైన ఘటనలు తెలంగాణలో మరెక్కడ జరగకుండా చూసుకోవాలన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవరావుపేట గ్రామంలోని బీసీ కాలనీలో కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. మంచి నీరు రాకపోవడంతో అందుబాటులో ఉన్న నీటినే ఆ కాలనీవాసులు తాగారు. కలుషిత నీరు తాగడం వల్ల ఆ కాలనీలో చాలామంది అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఇద్దరు దుర్మరణం చెందారు. మరో 50 మంది తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో వారిలో ఇద్దర్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి.. ఒకరిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

## పట్నం మహేందర్ రెడ్డిది ఏ పార్టీ

మొదటి పేజీతరువాయి...

(మండలి చీఫ్ విప్‌గా నియమించడం) అనర్హత పిటిషన్‌కు మరింత బలం చేకూర్చింది. దీన్ని కూడా అనర్హత పిటిషన్లో సాక్ష్యంగా చేరుస్తాం. ఎమ్మెల్సీ హోదాలోనే పంద్రాగస్టు, సెప్టెంబర్ 17న మహేందర్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. మార్చి 15 నుంచే ప్రభుత్వ చీఫ్ విప్ అని బులెటిన్ ఇచ్చారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాస్తాం. రాష్ట్ర గవర్నర్‌తో పాటు డీవోపీటీకి కూడా లేఖ రాస్తాం.. గవర్నర్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మాజీ మంత్రి బాబా సిద్దిఖీ దారుణ హత్య..

మొదటి పేజీతరువాయి...

కారణంగానే ఆయనను హంతకులు మట్టుబెట్టారా అనే పలు కోణాల నుంచి ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. హత్యకు పాల్పడిన వారుగా అనుమానిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయగా, మరో నిందితుడు పరారీలో ఉండటంతో అతని కోసం గాలిస్తున్నారు. పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరిలో ఒకరిని హర్యానాకు చెందిన గుర్మైల్ బల్జిత్ సింగ్ (23)గా, మరొకరిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మరాజ్ రాజేష్ కష్యప్ (19)గా గుర్తించారు. బాబా సిద్ధిఖిని చంపేందుకు హంతకులకు అడ్వాన్స్‌గ్గానే పేమెంట్ చెల్లించారని, ఆయుధాలను కొద్దిరోజులకు ముందుగానే వారికి సరఫరా చేశారని చెబుతున్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్లతో పాటు, ఆయుధాల చట్టం, మహారాష్ట్ర పోలీస్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ముంబై బాంద్రా నివాసం వెలుపల తన కుమారుడు, ఎమ్మెల్యే అయిన జీషన్ సిద్ధిఖి కార్యాలయం వెలుపల బాబా సిద్ధిఖిపై దుండగులు కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆయనను బాంద్రాలోని లీలావతి ఆసుపత్రి తరలిస్తుండగానే కన్నుమాశారు. సిద్ధిఖిపై షూటర్లు 9.9 ఎంఎం పిస్తోలుతో నాలుగైదు రౌండ్లు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. దసరా విసర్జన్ ఊరేగింపు సందర్భంగా బాణసంచా కాలుస్తుండగా ఆ పేలుడు మోతలో కలిసిపోయేలా సిద్ధిఖిపై దుండగులు కాల్పులు జరిపినట్లు తెలిపారు.

సిద్ధిఖీని తామే హత్య చేసినట్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ కేసులో ప్రస్తుతం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. బాబా సిద్ధిఖీ రాజకీయ నాయకుడిగానే కాకుండా ప్రైవేటు పార్టీలు నిర్వహించడంలోనూ ముంబయి వ్యాప్తంగా ఆయనకు మంచి పేరుంది. ప్రముఖ నటులు సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ మధ్య వివాదాన్ని కూడా ఈయన నిర్వహించిన పార్టీలోనే తీర్చారు. వారి మధ్య సంధి చేయడంలో బాబా సిద్ధిఖీ కీలక పాత్ర పోషించారు. సల్మాన్ ఖాన్‌కు బాబా సిద్ధిఖీ మంచి మిత్రుడు కూడా. ఆయన హత్య గురించి తెలియగానే బిగ్ బాస్ (హిందీ) షూటింగ్ మధ్యలో క్యాన్సిల్ చేసుకుని మరీ సల్మాన్ వచ్చారు. అయితే బాబా సిద్ధిఖీ హత్యకు కొన్ని నెలల నుంచే నిందితులు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఎప్పుడు ఎక్కడికి వెళ్తారు, ఏ సమయంలో ఎక్కడ ఉంటారనే పూర్తి సమాచారంతోనే హత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

శనివారం రాత్రి 9.30 గంటలకు బాంద్రాలోని తన కుమారుడు జీషన్ సిద్ధిఖీ కార్యాలయం వెలుపల మాజీ మంత్రి బాబా సిద్ధిఖీపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆయన కుప్పకూలిపోయారు. దీంతో ఆయనని లీలావతి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మరణించారని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఈ కాల్పులు జరిపింది బిష్ణోయ్ గ్యాంగ్ అని పోలీసులు భావిస్తున్నారు. ఆ క్రమంలో ఈ కేసులో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. 66 ఏళ్ల బాబా సిద్ధిఖీ బాంద్రా పశ్చిమ నియోజకవర్గం నుంచి 3 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ హత్య ఘటనపై విచారణను ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది.

ఇక ఈ హత్యపై ఎన్సీపీ శరద్ పవార్ వర్గానికి చెందిన ఎంపీ సుప్రీయా సులే సైతం స్పందించారు. ఈ హత్య ఘటన రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతుందని అన్నారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తికే ఈ విధంగా జరిగితే ఎలా అని ఆమె ప్రశ్నించారు. ఈ తరహా ఘటనలు ఏ మాత్రం ఆమోదయోగ్యమైనవి ఆమె స్పష్టం చేశారు. ఇక మహారాష్ట్ర మంత్రి ఛగన్ బుజబల్ మాట్లాడుతూ.. బాబా సిద్ధిఖీ హత్య కేసుతోపాటు బైకుల్లా తాలుక అధ్యక్షుడు సచిన్ కుర్మి హత్య కేసులో విచారణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిప్యూటీ సీఎం, హోం శాఖ మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

### స్పందించిన రాహుల్ గాంధీ

ఎన్సీపీ నేత, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్యపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆదివారం తన ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ హత్య ఘటనతో మహారాష్ట్రలో శాంతి భద్రతలు పూర్తిగా కుప్పకూలాయనే విషయం తేటతెల్లమవుతుందన్నారు. ఈ హత్య ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో న్యాయం గెలవాలన్నారు. అయితే బాబా హత్య వార్త తానను షాక్కు గురి చేసిందని చెప్పారు. ఈ ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా బాబా కుటుంబానికి రాహుల్ గాంధీ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# చెడుపై విజయానికి ప్రతీక రామ్‌లీలా

- ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు రావాలి
- ప్రతి ఏడాది నిర్వహిస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్





**హుస్నాబాద్,అక్టోబర్ 13,(మనం న్యూస్):** ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు ఇచ్చి వెలుగులు నింపాలని రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు వద్ద ఎస్.ఎస్.సి.1987-88 పూర్వ విద్యార్థులు రామ్‌లీలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హజరైనారు.రామ్‌లీలా కార్యక్రమానికి భారీగా జనం తరలివచ్చారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశం మొత్తం మీద అనేక రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రెండు దశాబ్ధలుగా హుస్నాబాద్‌లో రామ్‌లీలా కార్యక్రమం ఆగిపోయిందన్నారు. నేను శాసనసభ్యుడు అయ్యాక తరువాత చేయాలనుకున్నా అప్పుడే 1987-1988 బ్యాచ్ వాళ్లు వచ్చారని తెలిపారు. రాబోయే కాలంలో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం మరింత ఘనంగా నిర్వహిస్తామన్నారు. మీ ఆశీర్వాదంతో రాబోయే రోజుల్లో వ్యవసాయ, వ్యవసాయేతర రంగాల్లో మరింత అభివృద్ధి జరిగేలా ముందుకు తీసుకుపోతా అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, చిత్తారి పద్మ, భూక్య సరోజన, పున్నలావణ్య, వల్లపు రాజు,వాల సుప్రజ, కోమటి స్వర్ణలత, నళినిదేవి, పట్టణ మాజీ అధ్యక్షుడు డా.అక్కు శ్రీనివాస్, డిసిసి కార్యదర్శి చిత్తారి రవీందర్, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, తదితరులున్నారు.

## మధుసూధన చారికి సన్మానం



**రంగారెడ్డి అక్టోబర్ 13 (మనం న్యూస్) :** తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడిగా ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధన చారి ని శాసన మండలిలో కలిసి పూల బొకే తో సన్మానం చేసిన బి ఆర్ ఎస్ రాష్ట్రా నాయకులు మారోజు రామాచారి , తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు గోర శ్యామ్ సుందర్ గౌడ్ లు తదితరులు పాల్గొన్నారు.

## కుమార్తెను చంపేందుకు వ్యక్తిని నియమించిన మహిళ..

- ఆమెనే హత్య చేసిన కుమార్తె ప్రియుడు

**లక్నో, అక్టోబర్ 13:** కుమార్తె ప్రేమ వ్యవహారంపై ఆమె తల్లి కలత చెందింది. కూతుర్ని చంపేందుకు ఒక వ్యక్తిని నియమించింది. అయితే కుమార్తె ప్రియుడైన ఆ వ్యక్తి చివరకు ఆ మహిళను హత్య చేశాడు. క్రైమ్ సినిమాను తలపించేలా ఉన్న ఈ విషయం తెలిసి పోలీసులు షాక్ అయ్యారు. ఉత్తరప్రదేశ్లోని ఎటా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 42 ఏళ్ల అల్కా దేవి మైనర్ కుమార్తెను అఖిలేష్, అనికేత్ ప్రలోభపెట్టి కిడ్నాప్ చేశారు. బాలిక కుటుంబం ఫిర్యాదుతో నయాగావ్ పోలీసులు అఖిలేష్ను అరెస్ట్ చేశారు. ఆ బాలికను రక్షించి ఆమె కుటుంబానికి అప్పగించారు. కాగా, ఈ సంఘటన నేపథ్యంలో తల్లి అల్కా దేవి తన కుమార్తె గురించి ఆందోళన చెందింది. ఫరూఖాబాద్ జిల్లా సికందర్పూర్ ఖాస్ గ్రామంలోని తన తల్లి ఇంటికి ఆమెను పంపింది. అయితే ఆ బాలిక అక్కడ 38 ఏళ్ల సుభాష్తో సంబంధాన్ని పెంచుకుంది. గతంలో పదేళ్లు జైలు శిక్ష అనుభవించిన అతడు ఆ బాలికకు మొబైల్ ఫోన్ కొనిచ్చాడు. దీంతో వారిద్దరూ మాట్లాడుకోసాగారు. మరోవైపు కుమార్తె ప్రేమ వ్యవహారం సంగతి తెలిసి తల్లి అల్కా దేవి కలత చెందింది. కూతుర్ని చంపించాలని ప్లాన్ వేసింది. నేర చరిత్ర ఉన్న సుభాష్ను సంప్రదించి రూ.50,000కు ఒప్పందం చేసుకున్నది. అయితే హత్య కోసం నియమించిన వ్యక్తి కుమార్తె ప్రియుడే అన్న సంగతి అల్కా దేవికి తెలియదు. కాగా, అల్కా దేవి హత్య కుట్ర గురించి ఆమె కుమార్తెకు సుభాష్ చెప్పాడు. దీంతో తన తల్లిని చంపితే అతడ్ని పెళ్లి చేసుకుంటానని ఆ యువతి ప్రపోజ్ చేసింది. వారిద్దరూ కలిసి అల్కా దేవి హత్యకు ప్లాన్ వేశారు. అక్టోబర్ 5న ఆగ్రాలోని రామ్లీలా జాతర చూసేందుకు ఆమెతో కలిసి వాహనంలో వెళ్లారు. ఒకచోట అల్కా దేవి గొంతు నొక్కి హత్య చేశారు. మృతదేహాన్ని పొలాల్లో పడేసి వెళ్లిపోయారు. మరోవైపు అక్టోబర్ 6న అల్కా దేవి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆమె భర్తకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో గతంలో తమ కుమార్తెను కిడ్నాప్ చేసిన అఖిలేష్, అనికేత్పై ఆయన అనుమానం వ్యక్తం చేశాడు. అయితే కుమార్తె తన ప్రియుడితో కలిసి అల్కా దేవిని చంపినట్లు దర్యాప్తులో తెలుసుకున్న పోలీసులు షాక్ అయ్యారు. సుభాష్తోపాటు ఆ యువతిని అరెస్ట్ చేశారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాల నిమజ్జనం



**చేవెళ్ల, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** చెడుపై మంచి విజయానికి ప్రత్యేకగా జరుపుకునే విజయదశమి వేడుకలను రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల మండలంలోని గొల్లగూడెం గ్రామ ంలో ప్రజల నవరాత్రి దసరా వేడుకలు వైభవంగా జరుపుకున్నారు.దసరా సంబరాలను పురస్కరించుకొని ఆలయంలో ఏర్పాటుచేసిన అమ్మవారిని మండపాల వద్ద సామూహిక పూజలు నిర్వహించారు. ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి దసరా స్పెషల్ వంటకాలు ఆరగించారు. అనంతరం నవరాత్రి ముగిసినందున మండపాలలో ఏర్పాటుచేసిన అమ్మ వార్లను సాప్రసాదంగా ఊర్లో ఊరేగింపు నిర్వహించి మెదక్ నియోజకవర్గం లోని ఏడు పాయలు గ్రామం లో ననిమజ్జనం చేశారు. భవాని మాత మాల ధరించిన మాటలు భక్తి ప్రభక్తులతో అమ్మవార్లను ఊరేగించారు భజన గీతాలతో నృత్యాలు చేసి ఊరేగింపు కార్య క్రమాలను ఘనంగా నిర్వహించారు.జై మాతాజీ అంటూ నామస్మరణతో భక్తులు ప్రధాన వీధులు హోరెత్తాయి.ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ చేర్మెన్ చోవుల శంకరయ్య, కాం గ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చోవుల నర్సిములు.వైస్ చైర్మన్ తూర్పు కృష్ణ, ఆలయ కమిటీ మెంబర్స్, ముకుంద, నరేందర్ గౌడ్, మనోహర్ గౌడ్, మహేందర్, కర్ణుల, సత్త య్య,మోతి శ్రీశైలం, కుమార్, విజయ్ గౌడ్, మహేందర్, భాస్కర్, శ్రీనివాస్,గ్రామ పెద్ద లు,దుర్గామాత కమిటీ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

# భార్య భర్తల గొడవలు.. భార్యను హత్య చేసిన భర్త..!



**రంగారెడ్డి,అక్టోబర్ 13 (మనం న్యూస్) :** గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా భార్యని భర్త హత్య చేసిన సంఘటన సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లాకు చెందిన గుంజి సోను (32), గుంజి వెంకటేష్ కూలీ పనుల నిమిత్తం జీవనం సాగిస్తూ సరూర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధి సరస్వతి నగర్ లో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నారు.భర్త మేస్త్రి గా, భార్య ఇండ్లలో పని మనిషిగా జీవనం సాగిస్తూఉన్నారు.భార్య భర్తల మధ్య గత మూడు సంవత్సరాలనుండి తరచు గొడవలు చోటుచేసుకుంటున్నాయి. .పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో వివాదాల పరిష్కారం కోసం ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయ్..రోజు వారి క్రమంలో భార్య ను భర్త వెంకటేష్ బైక్ పై ఇంటికి తీసుకరావడం జరిగింది.ఇంట్లో ఇద్దరి మధ్య మళ్ళీ గొడవలు చోటుచేసుకోవడం, భార్య పంజాబీ డ్రెస్ విషయంలో గొడవలు పెట్టుకుని, ఆవేశంతో భార్యను భర్త హత్య చేశాడు.భర్త వెంకటేష్ కు కుడా గాయాలు కావడంతో వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించడం జరిగింది.సమాచారం అందుకున్న స్థానికులు సరూర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, హత్య కు గల కారణాలపై దర్యాప్తు చేపట్టడం జరిగింది.

# ఘనంగా దసరా వేడుకలు



- శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు.. మండల వ్యాప్తంగా పండుగ సందడి

**చిట్యాల,అక్టోబర్ 13(మనం న్యూస్) :** ఉమ్మడి రేగొండ మండల వ్యాప్తంగా శనివారం విజయదశమిని ప్రజలు ఘనంగా నిర్వహించారు.గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పాలపిట్ట దర్శనం కోసం గ్రామ శివారులకు వెళ్లారు. భక్తులందరూ ఆలయాలకు వెళ్లి జమ్మిపూజ నిర్వహించి బంధువులకు, స్నేహితులకు అందజేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై ఎన్. సందీప్ కుమార్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేగొండ గ్రామంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడు నూతల నిశిధర్ రెడ్డి స్వగృహంలో దసరా వేడుకల్లో పాల్గొని, జిల్లా, ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. రేగొండ గ్రామ పంచాయతీ ఆవరణంలో బొద్రాయి భూలక్ష్మి దేవతల పద్మశాలి సంఘం అధ్యక్షుడు నామాల రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయను కొట్టి ప్రారంభించారు.ఆయా గ్రామాల్లో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు కటకం రాజు తదితరులు పాల్గొన్నారు.

## 'భారత్ గర్వించదగిన కొడుకు' రతన్ టాటా: బెంజమన్ నెతన్యాహు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13:** భారత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణంపై ప్రపంచ దేశాల అధినేతలు సంతాపాలు తెలియజేస్తున్నారు. తాజాగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమన్ నెతన్యాహు స్పందించారు. భారత్-ఇజ్రాయెల్ మధ్య స్నేహ బంధానికి ఛాంపియన్గా రతన్ టాటాను ఆయన కొనియాడారు. ఈమేరకు ఎక్స్ వేదికగా శనివారం రాత్రి తన సంతాప సందేశాన్ని పంచుకున్నారు. ' భారత్ గర్వించదగిన కొడుకు' అని కొనియాడారు. భారత్-ఇజ్రాయెల్ సంబంధాలను పెంపొందించడంలో రతన్ టాటా ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ''ఇజ్రాయెల్లోని చాలామంది ప్రజలతో పాటు నేను కూడా రతన్ టాటా మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నాను. రతన్ టాటా భారత దేశం గర్వించదగిన కొడుకు. మన రెండు దేశాల మధ్య స్నేహబంధానికి ఛాంపియన్ అయిన రతన్ టాటాను కోల్పోవడం విచారకరం. దయచేసి రతన్ కుటుంబానికి నా సానుభూతిని తెలియజేయండి'' అని ఎక్స్ వేదికగా ప్రధాని మోడీని బెంజమన్ నెతన్యాహు కోరారు.

## పూరీ జగన్నాథ ఆలయంలోని 'మహాప్రసాదం' త్వరలో భక్తులకు ఉచితం

- 'మహాప్రసాదం'ను ఉచితంగా పంపిణీ చేయడం వల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.14-15 కోట్ల అదనపు వ్యయం కాగలదు

**భువనేశ్వర్, అక్టోబర్ 13 :** పూరీలోని జగన్నాథ ఆలయంలోని 'మహాప్రసాదాన్ని' భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఒడిశా ప్రభుత్వం యోచిస్తోందని ఆ రాష్ట్ర మంత్రి ఆదివారం తెలిపారు. ప్రణాళికాబద్ధమైన చర్య త్వరలో సాకారం కాగలదని ఒడిశా న్యాయ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఇక్కడ విలేకరులతో అన్నారు. 'మహాప్రసాదం' ఉచితంగా పంపిణీ చేయడం వల్ల ప్రభుత్వానికి ఏడాదికి రూ.14-15 కోట్ల అదనపు వ్యయం అవుతుందని హరిచందన్ అన్నారు. పవిత్ర ఒడియా 'కార్తీక' మాసం (రెండు నెలలు) తర్వాత అమలు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## అగ్నిపథ్ పథకంపై ప్రశ్నలు లేవనెత్తిన రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :** నాశిక్ లో అగ్నివీర్ లు ఇద్దరు శిక్షణ కాలంలో చనిపోయాక, ఒక సైనికుడి ప్రాణం కంటే మరో సైనికుడి ప్రాణం ఎందుకు ఎక్కువ విలువైనది అని ప్రధాని నరేంద్ర మోడీ, రాజ్ నాథ్ సింగ్ ను ప్రశ్నించారు.అగ్నివీర్ కుటుంబాలకు ఒకే పింఛను, ఒకే రకమైన ప్రయోజనాలు ఎందుకు అందవన్నారు. ఈ అన్యాయంపై తాను పోరాడతానన్నారు. నాశిక్ లో శిక్షణ కాలంలో గోహిల్ విశ్వరాజ్ సింగ్, సైఫత్ షిత్ చనిపోయారు. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి అని కూడా రాహుల్ గాంధీ అన్నారు. అగ్నివీర్ పథకంపై ఈ ఘటన అనేక ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. వారి కుటుంబాలకు పరిహారం సకాలంలో అందుతుందా అన్న అనుమానాన్ని కూడా వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ఈ విషయంలో విఫలం అయిందన్నారు. ఆయన ఈ విషయాలను ఎక్స్ వేదికగా హిందీలో పోస్ట్ చేశారు.

## రైలు పట్టాలపై మళ్లీ గ్యాస్ సిలిండర్

**రూర్కీ, అక్టోబర్ 13:** రైలు ప్రమాదాలను కల్పించే యత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఉత్తరాఖండ్ లోని రూర్కీ సమీపంలో రైల్వే ట్రాక్ పై ఎల్ పిజి సిలిండర్ కలకలం రేపింది. వెంటనే గూడ్స్ రైలు లోకో పైలట్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. ఉత్తర రైల్వే సిపిఆర్వో అధికారి ప్రకారం లలాండౌర్-ధంధేరా స్టేషన్ల మధ్య ఉదయం 6.35 గంటలకు ఈ ఘటన వెలుగుచూసింది. సిలిండర్ ను దూరంగా తీసుకెళ్లి పరిశీలించినప్పుడు అది ఖాళీదని తేలింది. స్థానిక పోలీసులు, జీఆర్పీ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ లలో ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి. వరుస ఘటనల నేపథ్యంలో అనేక సందర్భాల్లో లోకో పైలట్లు అప్రమత్తం కావడం వల్లే ప్రమాదాలు తప్పాయి.

## ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన వితరణ



**రంగారెడ్డి, అక్టోబర్13(మనం న్యూస్) :** గత 27 సంవత్సరాలుగా హూడ కాలనీలోని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన వితరణ కార్యక్రమాన్ని శుక్రవారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కలిసి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాధిక ధీరజ్ రెడ్డి, రాములు యాదవ్, సురేష్, విష్ణు, శ్రీనివాస్ భాస్కర్, గోపాల్, సుమారు 400 మంది భక్తులు తదితరులు పాల్గొన్ని అమ్మవారి అన్నప్రసాదాలు స్వీకరించారు.

## ఘనంగా ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు



**చిట్యాల,అక్టోబర్ 13 (మనం న్యూస్) :** తెలంగాణ తొలి శాసనసభాపతి ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు చింతల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిట్యాల మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జెన్నెయుగందర్ పువ్వాటి హరికృష్ణ ,కోడెల రాజమల్లు , గురుకుంట్ల కిరణ్, ఉప్పల కిరణ్,రాయిని శ్రీకాంత్, పిట్టల రాజమౌళి వేణు వంక శ్రీదేవి , చేదిరాల సరోజన, మూసాపురి రవి, కనకం తిరుపతి, కోడెల నంది, తాటిపెల్లి శ్రీనివాస్ ,బోల్ల చందు, మైదం కరుణ, సంగ రాజేందర్ ,భయగాని గణపతి, బొట్ల రవి ,ఇజ్జిగిరి ఆనందం, గొల్లపల్లి రాజు, చంద్రమౌళి ,బొమ్మ శరత్, వేముల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో ఘనంగా విజయదశమి వేడుకలు




**చేవెళ్ల,అక్టోబర్ 13(మనం న్యూస్) :** విజయదశమి వేడుకలు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రం లో ఘనంగా జరుగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని మండలాల లోని పలు గ్రామీణ ప్రాంతాలల్లో అమ్మవారిని వివిధ అలంకరణలో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహిస్తున్నారు. మండపాలలో ఏర్పాటుచేసిన అమ్మవార్లను సంప్రదాయంగా ఊరిగింపు నిర్వహించి సమీపంలోని చెరువు లో,ఏడుపాయల చెరువులలో లో,నిమజ్జనం చేశారు.భవాని మాత మాల ధరించిన మాటలు భక్తి ప్రభక్తులతో అమ్మవార్లను ఊరేగించారు.జై మాతాజీ అంటూ నామస్మరణతో భక్తులు ప్రధాన వీధులు హోరెత్తాయి.అనంతరం చేవెళ్ల పుష్కరినిలో భక్తి శ్రద్దలతో అమ్మవారి ని నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమం లో భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్‌సి ఫలితాల్లో సునామీ సృష్టించిన రామయ్య

**రంగారెడ్డి,అక్టోబర్ 13 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2024 డి ఎస్ సి ఫలితాల్లో దిల్ సుఖ్ నగర్ లోని రామయ్య కోచింగ్ సెంటర్ ప్రభంజనం సృష్టించి అత్యధిక ఉద్యోగాలు తమ కోచింగ్ సెంటర్ లో శిక్షణ తీసుకున్న వాళ్లే ఉద్యోగాలు సాధించారు అని రామయ్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సిరికొండ లక్ష్మి నారాయణ అన్నారు. ఉద్యోగాలు సాధించిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ జి టి, స్కూల్ అసిస్టెంట్ ( అల్ సబ్జెక్ట్స్) ,పి ఈ టి, యస్. ఎ - పిడి లలో స్టేట్ రాంక్స్ తో పాటు ప్రతి జిల్లా లో టాప్ ర్యాంక్ లతో ఉద్యోగం సాధించిన అభ్యర్థులు 50 శాతం నుండి 60 శాతం వరకు రామయ్య సంస్థ లో శిక్షణ పొందిన వారు కావడం గమనార్హం అని అన్నారు.రానున్న టెట్, డి యస్ సి, శిక్షణ కొరకు ప్రతి ఆదివారం కొత్త బ్యాచ్ కొరకు తరగతులు ప్రారంభించబడుతాయి అని తెలిపారు.

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన అరవింద్ శర్మ



**రంగారెడ్డి,అక్టోబర్ 13 (మనం న్యూస్) :** జిల్లెల గూడ క్యాంపు కార్యాలయం లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన మహేశ్వరం నియోజక వర్గం బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ. ఈ కార్యక్రమంలో నెంటూరి రవీందర్ రెడ్డి , పెండ్యాల నగేష్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, శ్రీమాన్ నారాయణ, సాజిద్, మహేందర్ రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి లు పాల్గొన్నారు.

మనం



## జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఘనంగా ఆయుధ పూజ



**జమ్మికుంట, అక్టోబర్ 13 (మనం న్యూస్)** :విజయదశమి సందర్భంగా జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో సిఐ వరౌగంటి రవి ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. ఈ ఆయుధ పూజలో ఎస్సై ఆరోగ్యం తో పాటు స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, జమ్మికుంట పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలో ఉన్న ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు దసరా పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ప్రతి ఒక్కరు తలపెట్టిన మంచి పని విజయంతో ముగియ్యాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం సిబ్బంది ఒకరికి ఒకరు జమ్మి అందించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## సీఎం కప్ టార్చ్ రిలే విజయవంతం చేయండి

- పెద్దపల్లి డివైఎస్ఓ సురేష్



**సుల్తానాబాద్,అక్టోబర్-13 (మనం న్యూస్ )**:సీఎం కప్ టార్చ్ రిలే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దపల్లి డివైస్ ఓ సురేష్ అన్నారు.సీఎం కప్ టార్చ్ రిలే అక్టోబర్-14 సోమవారం పెద్దపల్లి జిల్లాలోకి ప్రవేశించడం జరుగుతుందని, ఉదయం 9 గంటలకి సుల్తానాబాద్ శాస్త్రి నగర్ నుండి ప్రారంభమై ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ సుల్తానాబాద్ వరకు టార్చ్ రిలే నిర్వహించడం జరుగుతుందని పెద్దపల్లి డివైఎస్ఓ సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా సంఘాలు, క్రీడా అభిమానులు, క్రీడా పోషకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఘనంగా దుర్గ మాత శోభాయాత్ర

**రామకృష్ణాపూర్,అక్టోబర్ 13 (మనం న్యూస్)**:దేవి శరన్నవ రాత్రులు ముగించుకొని నిమజ్జనానికి బయలుదేరిన దుర్గ మాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.పట్టణంలో వివిధ మండపాల్లో నెలకొల్పిన దుర్గమాతలను డప్పు చప్పుళ్ళతో డిజే మోతలతో మహిళల నృత్యాలతో పవిత్ర గోదావరి నది నమజ్జనానికీ భక్తులు సాగనంపారు.ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పట్టణ ఎస్ఐ రాజశేఖర్ ఆద్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కోరుట్ల లో వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



**కోరుట్ల అక్టోబర్ 13 (మనం న్యూస్)**:కోరుట్ల పట్టణం పరిసర గ్రామాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. పట్టణంలోని జమ్మి గద్దె సమీపంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జమ్మి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలలో భాగంగా భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మ వారిని పూజించి సకల శుభాలు, జయాలు కలగాలని ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. జమ్మి కార్యక్రమం అనంతరం ఒకరికొకరు బంగారం పెట్టుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు .ఈ సందర్భంగా ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అని దుష్టులను అమ్మవారు భవాని అవతారంలో సంహరించిదని స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- పండుగ పూట విషాదం
- ఒక్కగానొక కొడుకు మృతితో తల్లడిల్లిన తల్లిదండ్రులు

**చిగురు మామిడి,అక్టోబర్ 13 (మనం న్యూస్)**:మోటార్ సైకిల్ అతివేగం, అజాగ్రత్త వల్ల ఓ యువకుడు నిండు ప్రాణం గాల్లో కలిసిపోయిన సంఘటన శంకరపట్నం మండలం తాడికల్,గ్రామం హైవే రోడ్డు మూలమలుపున చెట్టుకు ఢీకొని మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామస్థులు తెలిపిన ప్రకారం చిగురుమామిడి మండలం లంబాడి పల్లి గ్రామానికి చెందిన బండారుపల్లి రామస్వామి బతుకు తీరం కోసం కరీంనగర్లో జీవనోపాధి పొందుతున్న సమయంలో దసరా పండుగను పురస్కరించుకొని బండారుపల్లి వినయ్ 25 సంవత్సరాల యువకుడు తాడికల్ గ్రామంలో తన పిన్ని ఇంటికి దసరా పండగకి బయలుదేరి రాగా గ్రామ సమీపంలోని మూల మార్పు వద్ద బైక్ పై వెళుతున్న వినయ్ చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ వార్త తెలుసుకున్న వారి బంధువులు మృతుని తల్లిదండ్రులకు తెలిపారు. కుమారుని మరణ వార్త విన్న తల్లిదండ్రులు బోరును విలపించారు. వారి అర్ధనాదాలు నిన్నంటాయి. లంబాడి పల్లి గ్రామంలో విషాదచాయలు కమ్ముకున్నాయి .బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు .స్థానిక ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పైలాన్ పనులను ప్రారంభించారు.. మధ్యలోనే వదిలేశారు

- అయ్యో అంబేద్కరుడా ఏమిటి నీకీ దుస్థితి..






**మంచిర్యాల, అక్టోబర్13 (మనం న్యూస్ )**:మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహం పైలాన్ వద్ద మొదలు పెట్టిన అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు . పై లాన్ పనులను ప్రారంభించారు, మధ్యలోనే వదిలేశారు.దాంతో అయ్యో అంబేద్కరుడా ఏమిటయా నీకీ దుస్థితి అని జిల్లా ప్రజలతో పాటు , పట్టణ ప్రజలు కూడా చర్చించుకుంటున్నారు . మంచిర్యాల జిల్లా కేంద్రంలోలో ని ఐ .బి చౌరస్తా నుంచి మొదలుకుని బెల్లంపల్లి కి వెళ్ళే రహదారి లో మధ్యలో ఉన్న లక్ష్మి టాకీస్ దగ్గరి వరకు నాలుగు చోట్ల పైలాన్ ల నిర్మాణాలను చేపట్టారు . గత ప్రభుత్వ హయాం లో అప్పటి ఎమ్మెల్యే ఈ రూటులో రోడ్డు విస్తరణకు, సుందరీకరణకు నిధులు మజూరు చేయించి శంకుస్థాపనలు చేసి గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులను మొదలుపెట్టారు. జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద , వెంకటేశ్వర్ థియేటర్ వద్ద, బెల్లంపల్లి చౌరస్తా వద్ద, లక్ష్మీ థియేటర్ వద్ద, పైలాన్ల నిర్మాణాన్ని చేపట్టారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే దివాకర్ రావు నిధులను మంజూరు చేయించుకొని ఈ 4 స్థలాల్లో మహిళల నిర్మాణానికి పనులను ప్రారంభించారు. లక్ష్మీ థియేటర్, బెల్లంపల్లి చౌరస్తా,వెంకటేశ్వరా టాకీస్ రహదారులపై పనులు పూర్తయ్యాయి. ఐ.బి .చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద కూడా పనులు ప్రారంభించారు . అయితే పూర్తీ కాలేదు . అక్కడ వేసిన కంకర ,ఇసుక కుప్పలు దర్శనం ఇస్తున్నాయి.ఈ దారి గుండా బెల్లంపల్లి , మందమర్రి , ఆసిఫాబాద్, కాఘజ్ నగర్ లకు వెళ్తూ వందలాది వివిద రకాల వాహ నాలు రాక పోకలు సాగిస్తుంటాయి . గత ఏడాది జరిగిన అస్సెంబ్లీ వేన్ని కల్లో సుందరీకరణ , రోడ్డు వెడల్పు అంశాలు ఎన్నికల్లో కూడా ఒక అంశంగా మారింది . నిధులు దుర్విని యోగం చేశారని అప్పటి ఎమ్మెల్యే పై విమర్శలు, ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ , బిజెపి లు చేశాయి . ఎన్నికలు అయిపోయాయి . కాంగ్రెస్ గెలిచింది . అంత బాగానే ఉంది. మరి ఐబి చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మాత్రం పనులు అలాగే పూర్తిగా కాకా నా దగ్గర పనులు ఎప్పుడు ఇంకా పూర్తి చేస్తారని అంబేద్కర్ గారు అడిగినట్లుగా ఆయన చూపుడు వేలు ప్రస్నిస్తున్నట్లుగా ఉన్నది. పట్టణంలో ఏదైనా సందర్భంలో నిరసనలు, ధర్నాలు, రాసారోకోలు ఏది చేయాలన్నా కూడా అంబేద్కర్ విగ్రహం సమీపంలోని ఐబి చౌరస్తా వద్ద ఆందోళన కారులు , నిరసనకారులు, వివిధ రాజకీయ పార్టీలు ఈ చౌరస్తా వద్ద చేస్తుంటారు. రహదారిపై నిరసన అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి ఆ కార్య క్రమానికి సంబంధించిన విషయం పై స్పీచ్ లు దంచుతుంటారు. అన్ని బాగున్నాయి. కానీ ఇక్కడ చేపట్టిన పనులు, అక్కడ కనపడుతున్న కంకర, ఇసుక కుప్పలను దాటుకుంటూ వెళతారు కాని ఎందుకు పూర్తీ చేయడం లేదని ఎవరు అడగక పోవడం విచిత్రం . ఒకవైపు గోదావరిఖని,చెన్నూర్ వెళ్లాలన్న, మరోవైపు లక్షేట్ పేట వైపు ,ఇంకోవైపు అయిన బెల్లంపల్లి కి వెళ్ళాలంటే తప్పనిసరిగా ఐబి చౌరస్తాను టచ్ చేసి ఆ దారి నుంచే ఎవరైనా రాకపోకలు సాగించాలి. జిల్లా కేంద్రంలోని సంబంధిత అధికారులు, పర్యటనకు వచ్చే మంత్రులు, ప్రజా ప్రతినిదులు, ఎమ్మెల్యేలు మాజీలు ఎవరైనా కానీ వీరు కూడా ఈ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎందుకు పనులు పూర్తి కావడంలేదని ఎవరు ఆలోచించడం లేదు, సరి పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి . కాలి నడకన వెళ్లే పట్టణ ప్రజలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు కూడా అయ్యో అంబేద్కర్ అని ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా చేపట్టిన పైలాన్ పనులను త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం అవశ్యకత ఎంతైనా ఉంది.

# రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు




- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

**జమ్మికుంట రూరల్, అక్టోబర్ 13(మనం న్యూస్ )**:విజయదశమి పండుగ రోజు అందరూ ప్రశాంతంగా దసరా ఉత్సవాలను జరుపుకుంటున్న సమయంలో అనుకోకుండా జరిగిన ఒక ప్రమాదంలో పలువురు గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఘటన జమ్మికుంటలో చోటుచేసుకుంది. స్థానిక ప్రజలు కారు యజమాని పూజారి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం, పూజారి భార్య రాధిక వారి పనిమనిషి డ్రైవర్ అనిల్ ఏదో పని నిమిత్తం కాలేశ్వరం వెళ్లి తిరిగి వస్తూ పట్టణంలోని ఆదిత్య బార్ సమీపం లో గల రోడ్డు డివైడర్ ను కారు ఢీకొట్టింది. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఒక్కసారిగా పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. కారు ఢీ కొట్టిన విధానం చూస్తుంటే కారులో ప్రయాణించే వారు బ్రతికే అవకాశాలు లేవు. కారు ప్రమాదం జరగగానే ముందు ఉన్న రెండు బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పిందని వెనుక సీట్లో కూర్చున్న పూజారి భార్య రాధికకు తీవ్ర గాయాలు కాగా వైద్య చికిత్స పొందు హనుమకొండలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై స్థానిక పోలీసులను వివరణ కోరగా మాకు దరఖాస్తు ఇవ్వలేదని దరఖాస్తు ఇస్తే కేసు నమోదు చేసి విచారణ జరిపిస్తామని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును గమనిస్తే కారులో ప్రయాణించేవారు బ్రతికే అవకాశం ఉండదని పట్టణ ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఎంతో బలంగా ఉన్న రోడ్డు డివైడర్ కారు ఢీకొట్టడంతో ముక్కలు ముక్కలు కావడం కారు కూడా పూర్తిగా ధ్వంసం కావడంతో పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమా లేక నిద్రమత్త అధిక వేగమా అనేది తెలియ రాలేదు. పూజారి కుటుంబానికి ఇలా జరగడం బాధాకరమని పట్టణానికి చెందిన పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పూజారి భార్య రాధిక త్వరగా కోలుకొని రావాలని వారి ఆత్మీయులు పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

## మండలంలో ఘనంగా విజయదశమి వేడుకలు

- చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో ఆయుధపూజ



**చిగురు మామిడి, అక్టోబర్ 13 (మనం న్యూస్)**: చెడుపై మంచి సాధించిన విజయానికి సాంకేతంగా జరుపుకునే విజయదశమి వేడుకలను కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో 17గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దుర్గ మాత పూజతో పాటు జమ్మి పూజ నిర్వహించి ఒకరికి ఒకరు జమ్మి ఆకు పట్టుకొని అలాయి బలాయి చేసుకొని విజయదశమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై బండి రాజేష్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకల్లో భాగంగా దుర్గమాత పూజతోపాటు,ఆయుధపూజ, వాహన పూజ,శమీ పూజలు పోలీస్ సిబ్బందితో కలిసి జరుపుకున్నారు.పూజ అనంతరం ఆయుధాలపై పురోహితులు వేదమంత్రాలతో పూజించి ఇచ్చిన అక్షతలను చల్లారు.ఈ సందర్భంగా ఎస్సై రాజేష్ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో మండల ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, శాంతి భద్రతలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.పోలీస్ సిబ్బంది ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా విధులను సక్రమంగా నిర్వహించాలని కోరుతూ పోలీసు సిబ్బందికి, మండలం ప్రజలకు ఎస్సై రాజేష్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి వేడుకల్లో మండలంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై బండి రాజేష్ తమ పోలీస్ సిబ్బందితో ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు,గ్రామ పంచాయతీల కార్యదర్శులు,పలు పార్టీల నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 22 వసంతాల అపూర్వ కలయిక... ఆనందాల వెల్లువ

- గీత విద్యాలయం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వేములవాడ,అక్టోబర్ 13 (మనం న్యూస్)**: పట్టణంలోని గీత విద్యాలయం పాఠశాలలో 2001-2002లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆదివారం రోజున పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చదువు నేర్పిన గురువులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. . ముందుగా పాఠశాల వ్యవస్థాపకులు కీశే- ఆయచితుల రాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి,ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళుర్పించారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకే వేదిక వద్ద కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు.విద్యార్థుల కలయికల కోలహాలాలతో వేదిక పండుగ వాతావరణం సంతరించుకుంది.ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ తమ పాత జ్ఞాపకాలు ఆనందంగా పంచుకున్నారు.అనంతరం విద్యార్థులు అందరూ కలిసి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు పాఠశాల చిహ్నం గల మెమెంటోలు బహుకరించి అభినందనలు తెలియజేశారు.జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, రమేష్ ప్రసాద్, దేవేందర్, దేవి ప్రసాద్, భాను ప్రతాప్ ,రాజేందర్ లతో పాటుగా పాఠశాల పూర్వ విద్యార్థులు నవీన్, ఇమ్రాన్, చందన్,రాజు, బాలరాజు లతో పాటు విద్యార్థులు,విద్యార్థినిలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలి



- సిపి శ్రీనివాస్
- కమీషనరేట్‌లో ఆయుధ, వాహన పూజలు

**మంచిర్యాల,అక్టోబర్13 (మనం న్యూస్)** :విజయదశమి పండుగ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిది పెద్దపల్లి మంచిర్యాల్ జోన్‌ల ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి అన్ని రంగాలలో విజయం చేకూర్చాలని, రామగుండం పోలీస్ కమిషనరేట్ అన్ని రంగాలలో అగ్రభాగంలో ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో పోలీస్ కమీషనర్ ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి కలిగి ఉంటుందని అలాంటి విజయాలను చేకూర్చే విజయదశమి పర్వదినోత్సవం అందరికి సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖలో ప్రతి స్థాయిలోని అధికారి ప్రజా రక్షణలో ముందుంటూ మన్ననలు అందుకుంటూ పోలీస్ శాఖ గౌరవం మరింత పెరిగేలా పని చేయాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకుంటారని అన్నారు. సమాజంలో చెడును పారద్రోలేందుకు పోలీసు విభాగం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం వాహనాల పూజ నిర్వహించి అందరికి దసరా పండుగ శుభాకాంక్ష లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ఐపిఎస్., అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏ ఆర్ ఏ సి పి ప్రతాప్, సుందర్ రావు, ఆర్ ఐ లు దామోదర్,మల్లేశం,వామన మూర్తి,సంపత్,శ్రీనివాస్,రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం,ఎస్ఐ, ఆర్ఎస్ఐ లు,డ్రైవర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ

**లక్షెట్టిపేట, అక్టోబర్13(మనం న్యూస్)**:పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో విజయదశమిని పురస్కరించుకుని శనివారం సీ ఐ నరేందర్, ఎస్సై సతీష్ ల ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. పట్టణ పురోహితుడు కొత్తపల్లి భరద్వాజ్ శర్మ ముందుగా ఆయుధపూజ అనంతరం వాహనాల పూజ, షమీ పూజ చేశారు.ఈ సందర్భంగా సీఐ నరేందర్ మాట్లాడుతూ... ప్రతి ఏటా దసరాను పురస్కరించుకొని శక్తి స్వరూపమైన అమ్మ వారికి ఆయుధ, వాహన, శమి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని,శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం సిఐ, ఎస్సై పోలీస్ సిబ్బందికి దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్సైలు రామయ్య, రాజయ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా బుస్సా దశరథం గెలుపు

**వేములవాడ అక్టోబర్ 13 (మనం న్యూస్)**: రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆదివారం జరిగిన ఎన్నికలలో వేములవాడ పట్టణానికి చెందిన బుసదశరథం 35 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో మొత్తం 141 ఓట్లు పోల్ అయ్యాయి, అధ్యక్ష బరిలో బుస్స దశరథం, కట్కూరి శ్రీనివాస్ లు ఇద్దరు పోటీలో నిలిచారు, కట్కూరి శ్రీనివాస్ పై బుస్సా దశరథం 35 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు, బుస్స దశరథం కు 88 ఓట్లు రాగా,కట్కూరి శ్రీనివాస్ కు 53, ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారులు అగిరి వెంకటేష్, చందా రాజులు తెలిపారు, ఈ సందర్భంగా నూతన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బుస్స దశరథం మాట్లాడుతూ తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, అలాగే జిల్లాలోని ఆర్యవైశ్యులు అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.

## అఖిలభారత ఉర్దూ కవి సమ్మేళనానికి హాజరైన సుడా చైర్మన్

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 13 (మనం న్యూస్ )**:నగరంలోని ఎస్ ఎఫ్ ఎస్ గార్డెన్ లో శనివారం రాత్రి నిర్వహించిన అఖిలభారత ఉర్దూ కవి సమ్మేళనం ముషాయిరా కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ముషాయరాలు సమాజానికి మేలుకొలుపుగా దోహదపడతాయన్నారు. సమాజంలో జరుగుతున్న సామాజిక అసమానతలను రూపుమాపేందుకు ప్రజలను తట్టి లేపేందుకు సమాజాన్ని చైతన్య పరిచేందుకు ఉర్దూ కవి సమ్మేళనాలు నిర్వహణ అత్యంత ఆవశ్యకమన్నారు కోమటిరెడ్డి. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి విచ్చేసిన సియాసత్ ఉర్దూ దినపత్రిక ఎడిటర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఆమెర్ అలీ ఖాన్ గారిని శాలువా కప్పి నరేందర్ రెడ్డి ఆత్మీయంగా సన్మానించారు. ముషాయిరాకు హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి కి నిర్వాహకులు ఆత్మీయంగా సన్మానించారు.

# ధాన్యం 'కొలత'లతో కొత్త చిక్కులు!

- గింజను బట్టి బోనస్‌కు ఎంపిక నిరంతర పర్యవేక్షణకు కమిటీలు
- ధృవీకరణలో ఈక్రాప్ పత్రాలే ప్రామాణికం
- ఒకటికి రెండు సార్లు గింజల పరీక్ష

**హైదరాబాద్, అక్టోబర్ 13 :** వ్యవసాయరంగంలో అధునాతన సాంకేతిక అందుబాటులోకి వస్తున్నా వాటి పట్ల రైతుల్లో అవగాహణ కల్పించటంలోనే తగిన వేగం అందుకోలేక అధికార యంత్రాగం ఆపసోపాలు పడుతోంది. ప్రభుత్వం ఆశించిన ఫలితాలు అందించటంలో వెనుకబడుతోంది. రాష్ట్రంలో తొలిసారి ధాన్యం గింజల కొలతల ప్రక్రియ రైతుల్లో భయాలను పుట్టిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో నేలల స్వభావం ,వాతావరణం తదితర అంశాల వల్ల ధాన్యం గింజ సైజులో కొద్దిగా మార్పులు వచ్చే అవకాశాలు ఉన్నాయని , అటువంటి రకాలను సన్నధాన్యంగా గుర్తించకపోతే నష్టపోతామన్న సందేహాలు రైతులనుంచి వ్యక్తమవుతున్నాయి. బియ్యం గింజల కొలతల ప్రక్రియ పట్ల వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖలకు చెందిన వాటిలో ఏవి ఇంతవరకూ రైతుల్లో సరైన అవగాహన కల్పించలేకపోయాయి. రాష్ట్ర వ్యవసాయరంగం చరిత్రలో ఇప్పటివరకూ ధాన్యానికి కనీస మద్దతు ధరలు ..వాటి గ్రేడ్లను బట్టి నిర్ణయిస్తూ వచ్చారు. ఏగ్రేడ్ ,కామన్ గ్రేడ్ రకాలుగానే ధాన్యాన్ని ప్రభుత్వం సేకరిస్తూ వస్తోంది. ఏ గ్రేడ్ రకానికి కామన్ గ్రేడ్ కంటే 20రూపాయల మేరకు అధికంగా ధర చెల్లించేవారు. ఇక సన్నరకం ధాన్యం అయినా , దొడ్డు రకం ధాన్యం అయితే ఇదే గ్రేడ్ల కిందే కొనుగోలు జరిగేవి. సన్నరకం ధాన్యం అధికంగా ప్రైవేటు వ్యాపారులే కాస్తో కూస్తో అధికంగా ధర చెల్లించి కొనుగోలు చేస్తుండటంలో ఈ రకం ధాన్యం కూడా ధాన్యం సేకరణ కేంద్రాలకు తక్కవగానే వచ్చేది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సన్నరకాల వరిసాగును ప్రొత్సహిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సన్నరకాలు పండించే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం క్వింటాలుకు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, కామన్ రకాలకు రూ.2300 ధరను ప్రకటించింది.కొనుగోలు కేంద్రాల్లో కూడా ఇదే ధరలతో కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని సేకరిస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బిపిటి ,ఆర్ఎన్ఆర్, 15048, హెచ్ఎంటిసోనా , జై శ్రీరాం తదితర 33వరిరకాలను సన్నరకం ధాన్యాలుగా గుర్తించి ఆ మేరకు ఈ రకాలకు మాత్రమే క్వింటాలకు రూ.500బోనస్ ప్రకటించింది.



### క్యాలిపర్స్ ద్వారా బియ్యం గింజ కొలత:

చిన్న చిన్న వస్తువుల కొలతలు నిర్ధారించే కాలిపర్స్ సాయంతో సన్నధాన్యం గుర్తింపు ప్రక్రియను చేపట్టనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.గ్రెయిన్ కాలిపర్స్ ద్వారా ఈ కొలతలను నిర్వహించనున్నారు. రైతులు బస్తాల్లో తెచ్చిన ధాన్యం నుంచి పరీక్ష నిమిత్తం పది గింజలను తీసుకుంటారు. ఈ గింజల పొట్టు తీసిన తర్వాత బియ్యం గింజను గ్రేయిన్ కాలిఫర్స్ సాయంతో కొలత వేస్తారు .గింజ పొడవు 6 మిల్లీమీటర్లు మించరాదు. అదే విధంగా గింజ వెడల్పు 2మి.మి మించకుండా ఉంటే వాటిని సన్నరకంగా పరిగణిస్తారు. బియ్యం గింజ పొడవు వెడల్పు నిష్పత్తి 2.5 కటే ఎక్కువ ఉంటే వాటికి ప్రాధాన్యత ఇస్తారు. బియ్యంలో తేమ కూడా 17శాతం లోపే ఉండాలి. ఈ పరీక్షలకు నిలిచిన ధాన్యం మాత్రమే సన్నరకంగా ఎంపిక చేసి వాటికి మాత్రమే క్వింటాలకు రూ.500బోనస్ కలిపి మొత్తం రూ.2820 ప్రభుత్వం ఆ రైతుకు చెందిన బ్యాంకు ఖాతాకే నిధులు జమ చేస్తుంది.

### సమస్యల పరిష్కారిని కమిటీలు:

రాష్ట్రంలో తొలిసారి సన్న రకం ధాన్యం సేకరణను ప్రభుత్వం ప్రత్యేకంగా చేపడుతుండటంతో ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతై వాటిని వెంటనే పరిష్కరించేందకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. మండల స్థాయిలో కమిటీలను నియమించింది. తాసిల్దార్ , ఎంపిడివో, ఎస్ఐ, ఏఈవో, ఐకెపి ఎపిఎంవో, పిఏసిఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, మెప్మా సిఈవోలను ఈ కమిటీల్లో సభ్యులుగా నియమించింది. ఈ కమిటిలకు ఇప్పటికే ప్రాధమిక స్థాయిలో అవగాహణ కార్యక్రమాలు కూడా




నిర్వహించారు.

### ఈక్రాప్ రికార్డులే ప్రామాణికం:

రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్ కింద అన్ని రకాల పంటలు కలిపి మొత్తం కోటి 29లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగులోకి వచ్చాయి. ఇందులో 65.49లక్షల ఎకరాల్లో వరి సాగులోకి వచ్చింది. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో రైతుల పంట పొలాలు పరిశీలించింది. రైతు పేరు, అధార్ నెంబర్, పొలం సర్వే నెంబర్ , సాగు చేసిన పంట, పంటలో విత్తన రకం ,విస్తీర్ణం తదితర అంశాలను ఈ క్రాప్ పోర్టల్ ద్వారా నమోదు చేశారు. రైతులు తాము పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు, వ్యవసాయ మార్కెట్లకు తీసుకుని వేళితే ముందుగా వ్యవసాయాశాఖ అధికారుల ద్వారా ఈ క్రాప్ ధృవీకరణ పత్రం తీసుకోవాలి. అందులో ఆ రైతు పంటకు సబంధించిన అన్ని వివరాలు పొందు పరిచి ఉంటాయి. ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యంలో 91లక్షల మెట్రిక్ టన్నుల మేరకు కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేసింది. అందులో 50లక్షల టనులు సన్నరకం ధాన్యమే వస్తుందని అంచనా వేసి ఆమేరకు కొనుగోలు ప్రణాళికలను సిద్ధం చేసింది. ధాన్యం నుంచి గింజలను తీసి శాంపిల్ కింద బియ్యం గింజలను కొలిచే క్రమంలో ఈ క్రాప్ ధృవీకరణ పత్రం కూడా ప్రామాణికంగా మారనుంది. రైతులు తాము పండించిన ధాన్యం శాంపిళ్ల పరీక్షలో తేడాలు వస్తే ఒకటికి నాలుగు సార్లు ధాన్యం గింజలను పరీక్షకు పెట్టి ఈ క్రాప్ పత్రాన్నికూడా ఆధారంగా చూపాలని అధికారులు సూచిస్తున్నారు.

## దేవాలయ నిర్మాణానికి పదివేల రూపాయలు విరాళం



**చండూరు, అక్టోబర్ 13 (మనం న్యూస్):** చండూరు మండలంలోని బంగారిగడ్డలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి తనవంతుగా అదే గ్రామానికి చెందిన సుంకరి చంద్రశేఖర్ గౌడ్ .10,121/విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుంకరి రాములు గౌడ్, సుంకరి లింగయ్య గౌడ్, కర్నాటి యాదయ్య, బోయపల్లి రాజు, తలారి ముత్తయ్య, ఇరిగి నరసింహ, ఇరిగి సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ



**సూర్యాపేట, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి):** విజయదశమి పండుగను పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో అయిదు పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు ఎస్పి సన్ ప్రీత్ సింగ్ అధనపు ఎస్పి నాగేశ్వరరావు, జనర్ధన్ రెడ్డి గార్లతో కలిసి ఎస్పి గారు దుర్గాదేవి, ఆయుధ పూజలు నిర్వహించారు. పోలీసు సిబ్బందికి మిఠాయిలు పంచి పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమం సూర్యాపేట డివిజన్ డిఎస్పి రవి, ఏ ఆర్ డిఎస్పి నరసింహ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, ఆర్ ఐ నారాయణ రాజు, ఆర్ ఎస్ఐ లు సురేష్, సాయిరాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముప్పు వాటిల్లితే తగ్గేదేలే..

మొదటి పేజీతరువాయి...

ద్వేషపూరిత భావంతో, ద్వేషపూరితంగా దాడి చేయలేదన్నారు. ఎవరైనా మమ్మల్ని అవమానించినప్పుడు లేదా మన సమగ్రత, సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించినప్పుడు మాత్రమే పోరాడుతామన్నారు. మన ప్రయోజనాలకు ముప్పు కలిగితే, పెద్ద అడుగు వేసేందుకు సిద్ధంగా ఉన్నామని శత్రు దేశాలను హెచ్చరించారు.

### భారీ ప్రాజెక్ట్..

ఇదిలా ఉండగా.. బీఆర్ఓ నిర్మించిన ఈ 75 ప్రాజెక్టుల లో 22 రోడ్లు, 51 వంతెనలు, రెండు ఇతర ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో జమ్మూ కాశ్మీర్‌లో 19, అరుణాచల్ ప్రదేశ్‌లో 18, లడఖ్‌లో 11, ఉత్తరాఖండ్‌లో 9, సిక్కింలో 6, హిమాచల్ ప్రదేశ్‌లో 5.. బెంగాల్, రాజస్థాన్, నాగాలాండ్, మిజోరాం, అండమాన్ నికోబార్ దీవుల్లో ఒక్కొక్కటి ఉన్నాయి. ఈ 75 ప్రాజెక్టులతో బీఆర్ఓ ఈ ఏడాది మొత్తం 111 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పూర్తి చేసింది. వాటి మొత్తం ఖర్చు రూ.3,751 కోట్లు.'

### ఈశాన్య రాష్ట్రాలను బలోపేతం చేసేందుకు ప్రాజెక్టులు

శనివారం ప్రారంభించబడిన ప్రధాన ప్రాజెక్టులలో ఒకటి సిక్కింలో వ్యూహాత్మకంగా ముఖ్యమైన కుపుప్-షెర్తాంగ్ రహదారి. ఈ రహదారి జవహర్ లాల్ నెహ్రూ మార్గ్, జులుక్ యాక్సిస్ మధ్య ఒక ముఖ్యమైన లింక్గా పనిచేస్తుంది. ఇది ఆర్మీ సిబ్బంది, పరికరాల తరలింపు కోసం ప్రత్యామ్నాయ మార్గాన్ని అందిస్తుంది. వ్యూహాత్మక కారణాలతో సరిహద్దు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతోపాటు ఈ ప్రాంతాలు, ముఖ్యంగా ఈశాన్య ప్రాంతాల సామాజిక-ఆర్థిక అభివృద్ధిని నిర్ధారించేందుకు ప్రభుత్వం 'అచంచలమైన సంకల్పం'కు ఈ ప్రాజెక్టులు నిదర్శనం.

## అసోంలో భూకంపం.రిక్టర్ స్కేలుపై 4.2 తీవ్రత నమోదు

**గౌహతి, అక్టోబర్ 13:** అసోంలో భూప్రకంపనలు సంభవించాయి. ఉత్తర-మధ్య ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 4.2 తీవ్రతతో భూకంపం నమోదయినట్లు అధికారులు వెల్లడించారు. బ్రహ్మపుత్ర ఉత్తర ఒడ్డున ఉన్న ఉదల్ గురి జిల్లాలో ఉదయం 7:47 గంటలకు భూకంపం సంభవించింది. భూకంపం 15 కిమీ. లోతులో నమోదైనట్లు జాతీయ భూకంప కేంద్రం తెలిపింది. ఇక భూకంప కేంద్రం నిర్దిష్ట స్థానం గౌహతికి ఉత్తరాన 105 కిమీ. , అసోం- అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులోని తేజ్ పూర్ కు పశ్చిమాన 48 కిమీ. దూరంలో ఏర్పడింది. కాగా పొరుగున ఉన్న దర్రాంగ్, తమూ ల్పూర్, సోనిత్ పూర్, కామ్రూప్, బిశ్వనాథ్ జిల్లాల్లో కూడా ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈశాన్య ప్రాంతం భూకంప జోన్‌లో ఉండడం వల్ల తరచూ ఈ ప్రాంతంలో భూప్రకంపనలు చోటుచేసుకుంటుంటాయి.

## ఈవిఎంలపై ఈసి స్పష్టీకరణ ఇవ్వాలి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల ఓటింగ్ మెషిన్లపై (ఈవిఎంలు) కాంగ్రెస్ లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం(ఈసి) స్పష్టీకరణ ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబాల్ ఆదివారం డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఈవిఎంల దుర్వినియోగం జరిగిందన్నది తన అభిప్రాయం అని కూడా కపిల్ సిబాల్ అన్నారు.'' ఈవిఎం గురించి అంత బాగా తెలియదు నాకు. కానీ కాంగ్రెస్ లేవనెత్తే ప్రశ్నలకు ఎన్నికల సంఘం స్పష్టీకరణ ఇవ్వాలి. ఈవిఎంల దుర్వినియోగం జరిగి ఉంటుందని నేను నమ్ముతున్నాను. అది ఎంత మేరకు దుర్వినియోగం జరిగిందన్నది నాకు తెలియదు'' అని కపిల్ సిబాల్ అన్నారు.

## డ్యాన్సర్‌ను ఇంట్లో బంధించి.. అఘాయిత్యం!

**ఆగ్రా, అక్టోబర్ 13 :** ఈవెంట్ కోసం డ్యాన్సర్ను పిలిచి ఆమెను మూడు రోజుల పాటు ఇంట్లో బంధించి అఘాయిత్యానికి పాల్పడ్డో ఈవెంట్ మేనేజర్. తన భార్య సాయంతో ఈ కిరాతకానికి ఒడిగట్టిన ఘటన యూపీలోని ఆగ్రాలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినయ్ గుప్తా అనే వ్యక్తి ఘాజియాబాద్కు చెందిన యువతి (26)ని ఆగ్రాలో డ్యాన్స్ ప్రోగ్రామ్ ఉందంటూ కాంటాక్ట్ అయ్యాడు. దీంతో ఆమె అక్టోబర్ 8న ఆగ్రాకు రాగా.. గుప్తా ఆమెను తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ అతడి భార్య మత్తుమందు కలిపిన టీ ఇవ్వడంతో డ్యాన్సర్ అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత కాసేపటికి లేచిచూడగా.. కట్టేసి ఒక గదిలో పడేసినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. గుప్తా తనను మూడు రోజుల పాటు బంధించి అత్యాచారం చేసినట్లు పోలీసులకు తెలిపింది. డబ్బు సంపాదించేందుకు వ్యభిచారం చేయాలని కూడా డిమాండ్ చేశాడని.. మరో మహిళను కూడా ఇదే వృత్తిలో దించేందుకు బలవంతం చేశాడని వివరించింది. ఎలాగో అతడి చెర నుంచి తప్పించుకొని తాజ్గంజ్ పోలీస్స్టేషన్కు వచ్చి బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి గుప్తా, అతడి భార్యను శనివారం అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తమిళనాడులో భారీ వర్షాలు.. 5 జిల్లాలకు ఎల్లో అలర్ట్

**చెన్నై, అక్టోబర్ 13 :** తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తాంజావూర్, తిరునారూర్, తిరుకొట్టై జిల్లాల్లో కుండపోత వాన పడటంతో రహదార్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తేని జిల్లాలో జలపాతాలు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. వచ్చే 48 గంటల నుంచి తమిళనాడు వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణ శాఖ(ఐఎండి) వెల్లడించింది. దీంతో 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. చెన్నై సహా మరో ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## శరణ్య ఒరిస్సా దాబాను ప్రారంభించిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్

**తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 13 (మనం న్యూస్):** మండల కేంద్ర పరిధిలోని బడాయిగడ్డ గ్రామంలో గల శరణ్య ఒరిస్సా దాబా ప్రొప్రైటర్ హేమ నాయక్ ఆహ్వాన మేరకు ముఖ్య అతిథిగా హాజరై బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి శరణ్య ఒరిస్సా దాబా ను ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం శక్తితో ఎదిగి వ్యాపారాలలో మంచిగా ఎదగాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మండల వైస్ యంపిపి యడవల్లి దిలీప్ రెడ్డి,తాజా మాజీ సర్పంచ్ నడ్డి లింగయ్య యాదవ్, మాజీ యంపిటిసి వెంకటయ్య, మాజీ కోఆపరేటివ్ నాగెండ్ల కృష్ణారెడ్డి, పల్ రెడ్డి లక్ష్మిరెడ్డి, మాజీ యంపిపి తిరుమలనాథ గుడి మాజీ చైర్మన్ బుర్రి రామిరెడ్డి,శాగం కోటిరెడ్డి, పల్ రెడ్డి కరుణాకర్ రెడ్డి, చామల సురేందర్ రెడ్డి,చామల జయంత్ రెడ్డి, ఇస్రం ప్రశాంత్, గజ్జల శివానంద రెడ్డి, గజ్జల నాగార్జున రెడ్డి, అబ్దుల్ కరీం,కోడుమూరి సైదిరెడ్డి,బిపిఆర్ వైడిఆర్ అధ్యక్షుడు గడ్డం సజ్జన్, నితిన్,లింగాల సైదులు, పల్ రెడ్డి రమణారెడ్డి, పల్ రెడ్డి సదాశివ రెడ్డి, పల్ రెడ్డి నరసింహ రెడ్డి, పల్రెడ్డి రాంరెడ్డి, పల్ రెడ్డి రవీందర్ రెడ్డి ,మండల నాయకులు, గ్రామ



స్తులు ,తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఆఫ్రికన్ దేశాల పర్యటనకు రాష్ట్రపతి ముర్ము..

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :** ద్రౌపది ముర్ము ఆదివారం అల్జీరియా, మౌరి టానియా, మలావిలలో తన అధికారిక పర్యటనకు బయలుదేరారు. భారత దేశాధినేత ఒకేసారి మూడు ఆఫ్రికా దేశాలకు వెళ్లడం ఇదే తొలిసారి. అల్జీరియా అధ్యక్షుడు అబ్దెల్ మాడ్‌జిద్ టెబౌన్ ఆహ్వానం మేరకు అధ్యక్షుడు ముర్ము అక్టోబర్ 13న అల్జీరియాకు చేరుకుంటారు. అక్టోబర్ 15 వరకు ఆమె ఈ ఆఫ్రికన్ దేశంలోనే ఉంటారు. ఈ సమాచారాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

### ఇరు దేశాల అధ్యక్షుల మధ్య ద్వైపాక్షిక చర్చలు..

ఈ పర్యటన భారత్- అల్జీరియా మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. చమురు, గ్యాస్, రక్షణ, అంతరిక్ష సహకారం వంటి వ్యూహాత్మక రంగాల్లో ఇరు దేశాలు మరింత దగ్గరవుతాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ఇరువురు అధ్యక్షుల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరుగుతాయి. కౌన్సిల్ ఆఫ్ నేషన్ (అల్జీరియా పార్లమెంట్ ఎగువ సభ) మరియు నేషనల్ పీపుల్స్ అసెంబ్లీ (దిగువ సభ) అధ్యక్షులతో సహా పలువురు అల్జీరియన్ ప్రముఖులు కూడా ఈ సమావేశానికి హాజరవుతారు.

### భారతదేశం- అల్జీరియా మధ్య ఆర్థిక వేదికపై ప్రసంగం..

ఇది కాకుండా, అధ్యక్షుడు ముర్ము భారతదేశం-అల్జీరియా మధ్య ఆర్థిక ఫోరమ్, సిడి అబ్దెల్లా సైన్స్ అండ్ టెక్నాలజీ పోల్లో ప్రసంగిస్తారు. జార్డిన్ డి'ఎస్సే హమ్మా గార్డెన్స్లోని ఇండియా కార్నర్ను కూడా ఆమె ప్రారంభిస్తారు. దీని తరువాత.. భారత రాష్ట్రపతి అక్టోబర్ 16న ఈ ఉత్తరఆఫ్రికా దేశం నుంచి పొరుగు దేశం మౌరిటానియాను సందర్శిస్తారు. మౌరిటానియా ప్రస్తుతం ఆఫ్రికన్ యూనియన్ ఛైర్మన్‌గా కూడా ఉన్నారు.

### మారిషస్‌లోని భారతీయ కమ్యూనిటీ ప్రజలతో

మౌరిటానియా చేరుకున్న తర్వాత, ప్రెసిడెంట్ ముర్ము కౌంటర్ మొహమ్మద్ ఔల్ద్ చీక్ అల్ ఘజౌనీతో మాట్లాడతారు. మౌరిటానియా ప్రధాన మంత్రి మొఖ్తర్ ఔల్ దజయ్ మరియు విదేశాంగ మంత్రి మహమ్మద్ సలీం ఔల్ మర్జౌక్ను కలవనున్నారు. రాష్ట్రపతి భారతీయ కమ్యూనిటీకి చెందిన వారితో కూడా సంభాషిస్తారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, అధ్యక్షురాలి ఈ పర్యటన భారతదేశం-మౌరిటానియా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది.

### మలావి అగ్రనేతలతో సమావేశం

దీని తర్వాత, మలావి అధ్యక్షుడు డాక్టర్ లాజరస్ మెక్కార్థీ చక్వేరా ఆహ్వానం మేరకు అధ్యక్షుడు ముర్ము అక్టోబర్ 17-19 మధ్య మౌరిటానియా నుంచి తూర్పు ఆఫ్రికా దేశానికి చేరుకుంటారు.

అధ్యక్షుడు ముర్ము మలావి అగ్రనేతలతో సమావేశాలు నిర్వహించ నున్నారు. దీని తర్వాత ఆమె దేశంలోని వ్యాపార, పరిశ్రమల ప్రముఖులు మరియు భారతీయ ప్రవాసులతో సంభాషిస్తారు. దేశంలోని సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలను కూడా సందర్శిస్తారు.

## పదేళ్లు ఢిల్లీని పాలించాను.. ఒమర్‌కు సాయం చేసేందుకు రెడీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 13 :** ఇటీవలి జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్సీ- కాంగ్రెస్ కూటమి.. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఒమర్ అబ్దుల్లా నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేందుకు ఏర్పాటు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సీఎం అధికారాలు పరిమితంగా ఉండే ఢిల్లీని తాను పదేళ్లు పాలించానని.. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ పాలన విషయంలో ఏమైనా సమస్యలు వస్తే తనను సంప్రదించాలని ఒమర్కు సూచించారు. ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలు (జమ్మూకశ్మీర్, లద్దాఖ్)గా విభజించిన విషయం తెలిసిందే. ''జమ్మూకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా మరికొద్ది రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రభుత్వాన్ని నడపడంలో సంపూర్ణ మద్దతు అందిస్తాం. ఆయన నాయకత్వంలో జమ్మూకశ్మీర్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ఆశిస్తున్నాం. ముఖ్యమంత్రికి పరిమిత అధికారాలు ఉన్న కారణంగా ఢిల్లీని 'హాఫ్ స్టేట్' అని పిలుస్తారు. ఇప్పుడు జమ్మూకశ్మీర్ను ఇలాగే మార్చేశారు. ఎన్నికైన ప్రభుత్వానికంటే లెఫ్టినెంట్ గవర్నర్కే అధికారాలు ఎక్కువ. ఈ నేపథ్యంలో పాలనాపరంగా ఏదైనా సమస్య ఎదురైతే నన్ను సంప్రదించండి. ఢిల్లీ సీఎంగా పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపాను'' అని ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో దోడా స్థానం నుంచి విజయం సాధించిన ఆప్ ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్కు ఓటు వేసినందుకు ప్రజలకు కేజ్రీవాల్ ధన్యవాదాలు చెప్పారు. ఆదివారం దోడాలో పర్యటించిన ఆయన.. తాము అభివృద్ధిని మాత్రమే కాంక్షిస్తున్నామని.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీఎంలు లేదా ప్రధానమంత్రి కావాలనే రేసులో లేమని తెలిపారు. కొత్త తరహా రాజకీయాలకు 'ఆప్' పేరు పొందిందని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమన్నారు.

## కేరళ సిఎం పినరయి విజయన్‌పై గవర్నర్ నిందలు

**తిరువనంతపురం, అక్టోబర్ 13 :** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పై కేరళ గవర్నర్ ఆరిఫ్ ముహమ్మద్ ఖాన్ ఆరోపణలు చేశారు. పినరయి విజయన్ బంగారం స్మగ్లింగ్, దేశ వ్యతిరేక కార్యకలాపాల విషయంలో తనను అంధకారంలో ఉంచారన్నారు. ''ఒకవేళ దేశ భద్రత, సమగ్రతకు ముప్పు కలిగించే విషయాలు నా దృష్టికి వస్తే ఆ విషయాన్ని రాష్ట్రపతికి తెలియజేయడం నా విధి. ముఖ్యమంత్రే సమాచారంకు మూలమైనప్పుడు, నన్ను అంధకారంలో ఉంచినప్పుడు ఏమి చేయాలి? జాతి వ్యతిరేక కార్యకలాపాలు జరగలేదని ఆయన ఇప్పుడు అంటున్నారు'' అని గవర్నర్ మీడియాకు వివరించారు. ''జాతి వ్యతిరేక కార్యకలాపాలు, రాష్ట్ర వ్యతిరేక కార్యకలాపాల గురించి తానేమి అనలేదని ఆయన అంటున్నారు. ఆయన అన్న విషయాన్ని నేను విశ్వసిస్తాను. కానీ తర్వాత ఆయనే దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే బంగారం స్మగ్లింగ్ జరుగుతోందని అన్నారు. అది కూడా పన్ను ఎగవేతలో ఓ భాగం. ఆయన విలేకరుల సమావేశంలో తన న్నది జనరల్ స్టేట్ మెంట్ అన్నారు. కానీ బంగారం స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలే'' అని కేరళ గవర్నర్ ఆరిఫ్ ముహమ్మద్ ఖాన్ వివరించారు.

# ఉద్యమ ప్రస్థానం ఎటు పోతోంది..!





- ఆటోనే 'చైతన్య రథం
- కళాకారులతో విస్తృత ప్రచారం
- తెలంగాణ ఏర్పడ్డాక ప్రాభవం కోల్పోయిన ఉద్యమకారుడు
- ఉద్యమ చరిత్ర లేని వారికి అందలం
- రాష్ట్ర సాధనలో పని చేయని వారికి పదవులు
- ఉద్యమకారుడు బుడగం ఆవేదన

**పాల్వంచ, అక్టోబర్ 13( మనం న్యూస్ ):** ప్రత్యేక రాష్ట్ర సాధనలో పాల్వంచ కు ప్రత్యేక స్థానం ఉంది. పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో తొలి, మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నేతలకు సముచిత స్థానం దక్కలేదనే వాదన నగ్న సత్యం. నాటి ఉద్యమంలో పని చేయని షో కాల్ నేతలు దొడ్డి దారిన పదవులు అనుభవిస్తూ.. కోట్లకు పడగలెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే వ్యవస్థ అధికార దర్పం ప్రదర్శిస్తున్నప్పటికీ..పాల్వంచ ప్రాంతంలో క్రియాశీలకంగా ఉద్యమంలో పనిచేసిన నేతలు వీధి వ్యాపారులుగా మిగిలటం కొంత ఆవేదనకు గురిచేస్తుంది. ఇక్కడ ఎందరికో ఉద్యమ నేపథ్యం ఉన్నప్పటికీ.. వువ్వెత్తిన ఉద్యమ కాలంలో తనకున్న టాటా ఏస్ ఆటోనే ప్రచార రథం గా మార్చి విస్తృత ప్రచారం చేపట్టి, ప్రత్యేక రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిన వ్యక్తి బుడగం నాగేశ్వరరావు. నాగేశ్వరరావు మాటల్లోనే..ఆయన ప్రస్థానాన్ని ఓసారి నిశితంగా పరిశీలిస్తే.. మండల పరిధి యానం బైల్ కు చెందిన బుడగం నాగేశ్వరరావు ది వ్యవసాయ కుటుంబం. ఆది నుండి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు మక్కువతో ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించాడు. జీవనోపాధిగా ఎంచుకున్న ఆటోనే ప్రచార రథంగా మార్చి, పాల్వంచ వ్యాప్తంగా సహచరులను ఏర్పాటు చేసుకొని ఏజెన్సీ ప్రాంత ప్రజలను జాగృతం చేశాడు. ఆంధ్ర పాలకుల పెత్తందారీ విధానాలపై గొంతెత్తి ప్రశ్నించారు. తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలు, తెలంగాణ సాధిస్తే ప్రజలకు చేకూరే లబ్ధిపై కళాకారులతో కళా ప్రదర్శనలు కళ్లకు కట్టినట్లు చూపించారు. ఉమ్మడి ఆంధ్ర నుండి తెలంగాణ సిద్ధించాక ఉద్యమకారులను వదిలి, కేవలం పదవుల కోసమే ఇప్పుడు తెలంగాణ నినాదంతో స్వార్ధ రాజ కీయం చేస్తున్న షో కాల్ నేతలపై అసహనం వ్యక్తం చేశారు. తెచ్చుకున్న తెలంగాణ ఇం దుకేనా అనే ఆవేదన నాగేశ్వరావు నుండి వ్యక్తం అవుతుంది.

### నాటి ఉద్యమకారులతో..

వువ్వెత్తున సాగుతున్న ఉద్యమంలో గురు సమానులు తాళ్లూరి వెంకటేశ్వరరా వు, కొత్త కృష్ణారెడ్డి ల సూచనలతో సహచరులు పాల్ పోల్ బాలాజీ నాయక్, మంజూర్, కేసులాల్, దేవదానం, ఇజ్జ గాని రవి గౌడ్, మెంతిన కోటయ్య, హుస్సేన్, రషీద్, జైపాల్ రెడ్డి, పానిశెట్టి వెంకటేశ్వర్లు, మోతే శేఖర్, సురేష్, పూర్ణ లతో కలిసి ఉద్యమ సారదిగా నిలిచాడు. తెలంగాణ ఆకాంక్ష మేరకు తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించినట్లు బుడగం తెలి పారు.

### ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తులు వచ్చారు



ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక ఉద్యమంతో సంబంధం లేని, ఉద్య మాన్ని అవమానించిన కొందరు వ్యక్తులు ధనార్జనే లక్ష్యంగా కోట్లు కొల్ల గొట్టేందుకు ప్రభుత్వంలో చేరడం సిగ్గనిపిస్తోందని నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. జంపు జిలాని అవ తారమెత్తిన కొందరు ప్రబుద్ధులు ప్రజాకాంక్షను మరిచి తామే నాయకు లుగా చలామణి కావడం ఉద్యమకారునిగా కొంత కలత చెందినట్లు ఆది వారం 'మనం న్యూస్' కు తెలిపారు.

# పుట్టిన గడ్డపై మమకారంతో..

- దాతృత్వం చాటిన ఎన్ఆర్ఐ
- పేద విద్యార్థులకు నిత్యావసర సరుకుల అందజేత



**చర్ల, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** వృత్తి కోసం ఊరిని వీడి మూడు దశాబ్దాలు గడిచినా పురిటి గడ్డ పై ఉన్న మమకారం తగ్గలేదు ఎన్ ఆర్ ఐ జంటకు. అవసరం వచ్చిన ప్రతిసారీ నేనున్నానంటూ సహాయ సహకారాలను అందిస్తూ పలువురి మన్ననలను పొందుతున్నారు. చర్లకు చెందిన పసుపులేటి రామకృష్ణ – మిత్రవింద దంపతులు వృత్తిరీత్యా లండన్ లో స్థిరపడ్డారు. తండ్రి కొండకరావు చర్ల లో జిసిసి సేల్స్ మెన్ గా సేవలందచేసారు. స్టోరు కొండలరావుగా ఇక్కడి వారికి సుపరిచితులు. అందరితోనూ కలుపుగోలుగా ఉంటూ ఇక్కడ దాదాపు 30 ఏళ్లపాటు సేవలందచేసారు. తండ్రి వృత్తిరీత్యా కుమారుడు రామకృష్ణ బాల్యమంతా చర్ల లోనే సాగింది. ఉన్నత చదువుల కోసం పట్టణ ప్రాంతానికి వెళ్లి వైద్య విద్య పూర్తి చేసిన అనంతరం డాక్టర్ రామకృష్ణ – డాక్టర్ మిత్రవింద దంపతులు లండన్ లో వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. వారి మనసంతా ఉట్టిన ఊరు చర్లపైనే ఉంటుంది. ఇక్కడ జరిగే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఏ కార్యక్రమం చేపట్టినా తన వంతు సహాయ సహకారాలను అందచేయడం వీరి మానవత్వానికి నిదర్శనం. ఎక్కడో స్థిరపడ్డాము, ఎవరెటుపోతే మన కెందుకులే అనుకునే రోజులలో వీరి ఆలోచన దీనికి భిన్నంగా ఉంటుంది. పేదల కోసం ఎంతో కొంత సహాయం చేయాలన్న తపన. ఎక్కడ ఉన్నా వీరి దృష్టంతా పుట్టిన ఊరిపైనే ఉంటుందనడానికి నిదర్శనం చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయానికి నెలకు సరిపడా కిరాణా, ఇతర నిత్యావసర సరులకు లను తన స్నేహితుడు, వనవాసీ నిలయం ఉపాధ్యక్షుడు జవ్వాది మురళీకృష్ణ ద్వారా అందచేశారు. శనివారం రామకృష్ణ తల్లి సూర్యకాంతం వర్ధంతి సందర్భంగా ఈ వితరణను వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ లకు నిత్యావసర వస్తువులను అందచేసారు. ఈ సందర్భంగా వారు డాక్టర్ రామకృష్ణ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థులకు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అందచేయడం అబినందనీయమన్నారు. కార్యక్రమంలో గోగికార్ రాం లక్ష్మణ్, వేములపల్లి ప్రవీణ్, బందా స్వరూప రాణి పాల్గొన్నారు. కాగా ఇటీవల తన చిన్ననాటి స్నేహితుడు బాబూరావు మృతి చెందిన సందర్భంలోనూ ఆయన కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచి రూ. పది వేల రూపాయలను ఆర్థిక సహాయం అందచేసారు. నవంబర్ 24 న తన తండ్రి కొండలరావు వర్ధంతి సందర్భంగానూ మీ కోసం మేమున్నాము సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ప్రతి ఆదివారం – అన్నదానం కార్యక్రమం కు సైతం వితరణను ప్రకటించడం విశేషం. ఇలా పలు సందర్భాలలో ఇక్కడి అవసరాలకు అనుగుణంగా స్పందించడం పై ఇక్కడి వారి మన్ననలను పొందుతున్నారు. చిన్ననాటి మదుర స్మృతులను నెమరువేసుకుంటూ ఇక్కడివారి అవసరాలను గుర్తుంచుకొని డాక్టర్ రామకృష్ణ దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల చర్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మత సామరస్యాన్ని చాటిన నవరాత్రి ఉత్సవాలు



- ఉత్సవాల నిర్వహణలో యువకుల పాత్ర అభినందనీయం
- మున్సిపల్, జిపి, పోలీసు శాఖల పనితీరు భేష్
- సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా

**చుంచుపల్లి, అక్టోబర్ 13 (మనం న్యూస్):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ ఆటపాటలు ప్రజల్లో ఉత్సాహాన్ని నింపటమే కాకుండా మత మతసామరస్యాన్ని చాటి చెప్పాయని సిపిఐ భద్రాద్రి జిల్లా ఎస్.కె సాబీర్ పాషా అన్నారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా విద్యానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంటపంలో ఆదివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని సాబీర్ పాషా ప్రారంభించారు. తొలత దుర్గాదేవి విగ్రహాన్ని సందర్శించి ప్రజలకు, ఉత్సవ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణలో యువత పాత్ర కీలకంగా నిలిచిందని, మంటపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు నిరంతరం శ్రమించి ప్రజలను ఒకే తాటిపైకి తెచ్చారని అన్నారు, ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంచేందుకు తమవంతు కృషిచేశారన్నారు. బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదేశాలు, సూచనమేరకు మున్సిపల్, గ్రామపంచాయతీ శాఖలు చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని, అదేవిధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ చేపట్టిన బందోబస్తు భేషుగ్గా ఉందని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలు, ప్రభుత్వ శాఖల అధికారులు కలిసి ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వాసిరెడ్డి మురళి, పోలిన శీను, పిపి రాధాకృష్ణ, జి.నగేష్, వాసిరెడ్డి ప్రసాద్, రామారావు, కృష్ణమోహన్, చావా శీను, అమర్ నాథ్, భాగం మాధవరావు, నేరేళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ పూట విషాదం

- తాలిపేరులో పడి ఇద్దరు యువకుల మృతి




**చర్ల, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** చర్ల మండలంలో దసరా పండుగ పూట విషాదం నెలకొంది. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా తాలిపేరు నదిలో మునిగి ఇద్దరు యువకులు మృతి చెందడంతో విషాదచాయలు అలముకున్నాయి. చర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన భక్తులు సద్దుల బతుకమ్మ వేడుకలను ముగించుకొని మేళతాలాల నడుమ ఉత్సాహభరిత వాతావరణంలో శనివారం దండుపేట వద్ద గల తాలిపేరు నదికి నిమజ్జనం కొరకు చేరుకున్నారు. మొక్కుబడులు చెల్లించుకొన్న మహిళలు బతుకమ్మలను నదిలో నిమజ్జనం చేసారు. వీరి వెంట వచ్చిన కొంతమంది యువకులు నిమజ్జనం అనంతరం స్నానం చేసేందుకు నదిలోకి దిగారు. శనివారం ఉదయం తాలిపేరు గేట్లను ఎత్తి 16,500 క్యూసెక్కుల వరదను అధికారులు దిగువకు విడుదల చేసారు. నది ఉధృతి, లోతును అంచనా వేయని ఐదుగురు యువకులు స్నానాలకు దిగిన క్రమంలో ఒండ్రు మట్టిలో కాళ్లు దిగబడి మునిగిపోతుండగా గమనించిన ఒడ్డుపై ఉన్న మహిళలు తమ చీరలను నదిలోకి వేసి రక్షించే యత్నం చేసారు. గట్టుపల్లి జంపన్న (26) అనే యువకుడు దైర్యం ప్రదర్శించి ఈతకొట్టు కుంటూ వెళ్లి నలుగురు యువకులను కాపాడి ఒడ్డుకు చేర్చాడు. ఐదవ యువకుడు సోయం మహేందర్ (లక్కీ) ను ఒడ్డుకు చేర్చే యత్నంలో నీట మునిగి ఇద్దరూ మృతి చెందారు. ఒడ్డుపై ఉన్న యువకులు చీరల సహాయంతో నదిలోకి దిగి నీట మునిగిన జంపన్న ,మహేందర్ లను బయటకు తీసి ద్విచక్ర వాహనాలపై చర్ల సి హెచ్ సి కి తరలించారు. వైద్యుడు కాంత్ యువకులకు సిపిసి నిర్వహించి బ్రతికించేందుకు ప్రయత్నం చేసారు. యువకులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృత దేహాలకు డాక్టర్ సాయివర్ధన్ పోస్ట్ మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు యువకుల మృతిపై పోలీసులు కేసునమోదు చేసారు.కాగా ఆదివారం గ్రామంలో ఇద్దరు యువకులకు అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ఏన్కూరు, అక్టోబర్ 13(మనం న్యూస్):** ఏన్కూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ పాఠశాల్లో 1999–2000 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. తొలుత అప్పుడు పనిచేసిన ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు స్వాగతం పలికారు. విద్యార్థులు పాఠశాలలో కలియతిరిగి పాత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆనందంగా ఫోటోలు, సెల్ఫీలు దిగి సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 1999–2000 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థిని కమల, సులోచన ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేయడం తమకెంతో గర్వంగా ఉందన్నారు. తమ స్నేహితురాలు ఇదే పాఠశాలలో చదువుకొని మరల ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కమల, సులోచనలను స్నేహితులు శాలువాతో సత్కరించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపసాటి కిషోర్, బుచ్చాల నరేష్,పాముల హరీష్,కృష్ణయ్య, జాగర్లమూడి సురేష్, తాళ్లూరి నవీన్, రమాదేవి, గౌసియా బేగం, రజిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నాగుపల్లిలో ఎమ్మెల్యే జారె విస్తృత పర్యటన



**దమ్మపేట, అక్టోబర్ 13 (మనం న్యూస్):** దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదివారం ఉదయం మార్నింగ్ వాక్ ద్వారా విస్తృతంగా పర్యటించారు. ముందుగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పనుగంటి వెంకయ్య , దేశిరెడ్డి మాధవ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వారి నుంచి పలు సూచనలు స్వీకరించారు. అనంతరం మారగాని నాగేశ్వరరావు కు అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం ఒక లక్ష రూపాయలు అవసరమవుగా ఎల్ఓసి మంజూరు చేయించి ఆ చెక్కును వారికి ఇంటికెళ్లి అందించారు. అనంతరం పెరాలసిస్ తో బాధపడుతున్న ఆంగోతు రాంబాబును పరామర్శించి వారికి స్వయంగా ఫిజియోథెరపీ చేశారు.అదే గ్రామంలో పలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ హాస్పటల్లో ట్రీట్మెంట్ పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఇస్లావత్ నాగేశ్వరరావు, చల్లా పున్నయ్య , తూనూరి డేవిడ్ , చల్లా బాబురావు ను పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా ఏదైనా వైద్యం అవసరమైతే తనను సంప్రదించాలని వారికి భరోసా ఇచ్చారు. అలాగే ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నూజివీడు విజయలక్ష్మి, రంగు మాధవాచారికి అందించారు. అలాగే ధారావత్ ప్రసాద్ కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగ పూట విషాదం



**కరకగూడెం, అక్టోబర్ 13(మనం న్యూస్):** పండుగ పూట విషాద ఛాయల అలముకున్నాయి, కరకగూడెం మండలం పరిధిలో జరిగింది. బైక్ అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన సంఘటన మండలంలోని మద్దెలగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రేగళ్ల పంచాయతీ గోత్తికొయా మదనగూడెం గ్రామానికి చెందిన మడకం భద్రు 60 సంవత్సరాలు, బస్తార్,దంతేవడా పరాకాకాడి గ్రామానికి చెందిన హిమ్లా దేవ 27 సంవత్సరాలు, రేగళ్ల గ్రామము నుండి బైక్ పై వస్తుండంగా మద్దెలగూడెం మూలమలుపు వద్ద అదుపుతప్పి చెట్టుని ఢీకొని అక్కడిక్కడికి మృతి చెందరు. అటుగా వెళుతున్న కొందరు వ్యక్తులు చూసి సమాచారం అందించడంతో ఎస్ఐ రాజేందర్ సంఘటన స్థలానికి చేరుకొని, వివరాల అడిగి తెలుసుకున్నారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు.

## 'పండగ అల్లుడు' పుస్తకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సిఎం



**మధిర, అక్టోబర్ 13(మనం న్యూస్):** మధిర సాంస్కృతిక సారథి ,నటుడు, రచయిత, మధిర బాబ్లా రచించిన బాల సాహిత్యం నాటికల ఐదవ పుస్తకం, 'పండగ అల్లుడు' ను రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఇంతకుముందు 'మధిర బాబ్లా 'చే ఐదు పుస్తకాలు విడుదల అయ్యాయి. ఇప్పటివరకు ముద్రిత నాటికలు 70, అముద్రితాలు 20. గత నెలలో గుంటూరు 'సంస్కృతి' సంస్థ వారు నిర్వహించిన నాటికల రచనల పోటీలో, 'మధిర బాబ్లా' రచించిన 'తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త 'అనే నాటికకు రాష్ట్ర స్థాయి బహుమతిని గెలుచుకున్నది. ఈ కార్యక్రమంలో పుతుంబాక కృష్ణ ప్రసాద్, బాణావత్ రమణ పాల్గొన్నారు.

## శబరిస్మృతి యాత్రలో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



**భద్రాచలం, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి శబరిస్మృతి యాత్రలో పాల్గొనాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకి ఆహ్వానము అందజేసిన కార్యనిర్వహణ అధికారి శ్రీ మతి రమాదేవి. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుని సన్మానించి, స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈ రవీంద్ర రాజు, సూపర్డెంట్ కత్తి శ్రీనివాస్ రావు, ఎమ్మెల్యే సిసి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాజీ సర్పంచి మృతి



**మహా ముత్తారం, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** మండలం రేగుల గూడెం మాజీ సర్పంచ్ బూసి దేవేందర్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయన మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి తీరని లోటని ఆయన సేవలు నెమరు వేసుకున్నారు. దేవేందర్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించాడు. టిఆర్ఎస్ కరుడు గట్టిన నాయకునిగా ఎదిగాడు నాడు పీపుల్స్ వార్ పార్టీ కార్యకర్తగా రమేష్ అన్న, శోభక్క, తతన్న, ప్లాటూన్ నా యకుడు ప్రభాకరన్నాలతో మంచి సంబంధాలు ఉండి లీగల్ నాయకునిగా ఎదిగి మంచి పేరు ప్రఖ్యాతలు సం పాదించాడు. మహాదేవపూర్ పోలీ స్ స్టేషన్ బాంబు దాడిలో దేవేందర్ రెడ్డి పై ఫోటో కేసు నమోదైన చరిత్ర ఉంది. అలాగే రేగులగూడెం గ్రామ పంచాయతీలో నాటి పీపుల్స్ వార్ పార్టీ అభివృద్ధి కమిటీ నాయకునిగా పని చేశారు. చురుకైన నాయకునిగా ఎదిగి గ్రామపంచాయతీ పరిధిలో పేద ప్రజల కోసం పోడు భూముల దున్నుకోవాలని పిలుపునిచ్చి ఎవరైనా అభ్యంతరం తెలిపితే తన సైన్యంతో ఎదుర్కొనే వాడు అలాగే దేవేందర్ రెడ్డి అండతో గ్రామపంచాయతీ పరిధిలో దాదాపు 250 బోర్లు వేయించిన చరిత్ర ఇతనిది. ప్రస్తుతం 50 ఎకరాల వారి పంటకు నీళ్ల సౌలతో లేకపోవ డంతో బుసి దేవేందర్ రెడ్డి తన సొంత ఖర్చులతో కిలోమీటర్ పాటు రైతుల తో తన సొంత ఖర్చులతో కాలువ తీ యించి మిషన్ భగీరథ నీటితో చెరువు లు నింపి 50 ఎకరాల సాగుకు సహకరించారు గత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్ గా పోటీచేసి ఎన్నికయ్యారు.

# అత్యంత క్లిష్టతరమైన శస్త్ర చికిత్స ద్వారా ప్రాణదానం

- చిన్న పేగు గాంగ్రీన్‌తో బాధపడుతున్న రోగి ప్రాణాలను కాపాడిన వైద్యబృందం
- నల్గొండలో విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్ డాక్టర్ సాయిబాబు

**నల్లగొండ, అక్టోబర్ 13 (మనం న్యూస్):** చిన్న పేగులో గాంగ్రీన్, దీన్నే వైద్య పరిభాషలో బవెల్ ఇన్ ఫార్క్ షన్ అంటారని పేగులో రక్త ప్రసరణ సరిగ్గా జరగకపోవడంవల్ల ఈ పరిస్థితి తలెత్తడం వల్ల తీవ్రమైన ఇన్ ఫెక్షన్ సోకుతున్న నేపథ్యంలో కొన్ని కేసుల్లో ఇది మలమూత్రాదుల స్తంభనకు మాత్రమే కాక మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్ కి కూడా దారి తీస్తుందని హైదరాబాద్ మలక్పేట యశోద హాస్పిటల్ సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ సర్జన్ డాక్టర్ సాయిబాబు అన్నారు . ఆయన ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సరైన సమయంలో సరైన చికిత్స అందకపోతే రోగి ప్రాణాలు పోయే ప్రమాదం చాలా ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ వ్యాధికి సంబంధించి ఇంటెస్టినల్ గాంగ్రీన్ పెర్ఫొరేషన్ పెరిటోనిటిస్– సివియెల్ సెప్సిస్ తో బాధపడుతున్న నల్లగొండ పట్టణానికి చెందిన వెంకట్ రెడ్డి 51 సంవత్సరాల ఓ వ్యక్తిని యశోదా హాస్పిటల్ అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో ఎమర్జెన్సీ కేర్ కు తీసుకొచ్చినట్లు తెలిపారు. అప్పటికి ఉన్న స్థితిలో మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్ ద్వారా ఆ వ్యక్తికి ఏ క్షణానైనా మరణం సంభవించవచ్చు అనే పరిస్థితిలో రోగికి అత్యాధునిక శస్త్ర చికిత్స చేసి, ఐసీయూకు తరలించి, వెంటిలేటర్ సపోర్ట్ ఇస్తూ, డయాలసిస్ చేస్తూ అత్యవసర సేవల విభాగంలో అత్యంత శ్రద్ధతో వైద్యం చేసి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు.మల్టీ డిసిప్లినరీ సమర్థులైన వైద్యుల బృందం ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో ఆ రోగికి శస్త్ర చికిత్స చేసి, అనంతరం ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో అత్యాధునిక వైద్య సేవల్ని అందించి, రోగి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు.యశోదా మలక్ పేట్ అత్యవసర వైద్య సేవల విభాగానికి వచ్చే సరికి రోగి భరించలేని పొట్ట నొప్పితో మెలికలు తిరుగుతూ కేకలు పెడుతున్నాడని, వాంతులు చేసుకుంటూ ఊపిరి అందని స్థితిలో కొట్టుమిట్టాడుతు మూడు రోజులుగా మూత్ర విసర్జన బాగా తగ్గిపోయిందన్నారు. మొదట అతన్ని స్థానిక ఆసుపత్రిలో చేర్చగా ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న ఆ రోగిని స్థానిక ఆసుపత్రి వైద్యుల సలహాతో వెంటనే హైదరాబాద్ మలక్ పేటలోని యశోదా ఆసుపత్రికి తీసుకొచ్చాక యశోదా ఆసుపత్రి వైద్యబృందం వెంటనే అతన్ని అత్యవసల సేవల విభాగంలో చేర్చుకుని రోగిని ఆగమేఘాలమీద ఎక్స్ పరేటరీ లాప్రెక్టమీ ద్వారా చిన్న పేగుకు ఆపరేషన్ చేసి శస్త్ర చికిత్స తర్వాత ఐసీయూకు తరలించి వెంటిలేటర్ అమర్చి, డయాలసిస్ చేస్తూ మల్టిపుల్ డిసిప్లినరీ వైద్య సేవల్ని అందించి అతని ప్రాణాలను నిలబెట్టి రోగి ఆరోగ్యం చక్కబడ్డాక ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ చేశామన్నారు. నిపుణులైన యశోదా ఆసుపత్రి వైద్య బృందం సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు, యశోదా ఆసుపత్రి అందిస్తున్న అంతర్జాతీయ స్థాయి అత్యాధునికమైన వైద్య సేవలకు ఈ కేసు కూడా మరో చక్కటి ఉదాహరణ గా పేర్కొన్న ఆయన హైదరాబాద్ మలక్ పేట యశోదా ఆసుపత్రిలో మాత్రమే కాక యశోదా ఆసుపత్రి అన్ని శాఖల్లోనూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు, వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని డైరెక్టర్ గోడుకంటి పవన్, యూనిట్ హెడ్ కె.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ చిదుర తెలిపారు. మరింత సమాచారం కోసం ఎ. వాసుకిరణ్ రెడ్డిని 9705771230/9949998378 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



## దుర్గామాత నిమజ్జన ర్యాలీ



**తిరుమలగిరి, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** తిరుమలగిరి పాత గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత నిమజ్జనం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివారం భారి ర్యాలీ నిర్వహించారు. కోలాట దళం డప్పు చప్పుళ్ళు నృత్యాలతో దుర్గామాత ర్యాలీ నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎస్. రఘునందన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్ కుమార్, సంకెపెల్లి నరసింహారెడ్డి,వెంకట్ రెడ్డి, ఈశ్వరయ్య, కందుకూరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు



**భువనగిరి, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** దసరా పండగ సందర్భంగా శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కి జమ్మి పెట్టి ఆలాయి బలాయితో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బాత్కా అశోక్, రాచమల్ల సందీప్, అమీర్ లు శాలువా కప్పి దసరా పండగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## ఘనంగా దసరా పండుగ ఉత్సవాలు



**చండూరు, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** చండూరు మున్సిపాలిటి పరిధి మరియు మండలంలోని గ్రామాలలో దసరా పండుగ ఉత్సవాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు జమ్మి చెట్టు వద్దకు చేరుకొని పురోహితులతో జమ్మి చెట్టుకు శమీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు ఆప్యాయంగా జమ్మి ఆకులను ఇచ్చుకుంటూ అలై బలై కార్యక్రమం నిర్వహించారు.

# సోమవారం నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- జిల్లాలో 325 కేంద్రాలను ప్రారంభించాలి
- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

**నల్లగొండ, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) :** సోమవారం నాటికి జిల్లాలో గుర్తించిన 325 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితులలో ప్రారంభించాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఆర్డీవోలు, తహసిల్దార్లను ఆదేశించారు.ఆదివారం ఆయన దాన్యం కొనుగోలు కేంద్రాల విషయమై జిల్లాలోని ఆర్డీవోలు, తహసిల్దార్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వానకాలం పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నల్గొండ జిల్లాలో (375) ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని ,అయితే మొదటి విడుతన (325) కొనుగోలు కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని, గతంలో నిర్దేశించిన మేరకు సోమవారం లోగా సాయంత్రంలోగా (325) కు (325 ) ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎట్టి పరిస్థితులలో ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్ని బ్యాగులతో పాటు, అవసరమైన టార్పాలిన్లు (4) తూకం కొలిచే యంత్రాలు,( 2 ) తేమ కొలిచే యంత్రాలు, రైతులు వేచి ఉండేందుకు టెంట్, కుర్చీలు, తాగునీరు ,విద్యుత్ సరఫరా వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు .ఈ విషయంలో ఆర్డీవో లు, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ప్రత్యేకించి చొరవ తీసుకోవాలని ఆయన కోరారు .ఆదివారం నాటికి అన్ని మండల కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి కావాలని, సోమవారం సాయంత్రం లోపు అన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు, కొనుగోళ్ళు సైతం ప్రారంభించాలని చెప్పారు. రాష్ట్ర రోడ్లు భవనాలు ,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇదివరకే నల్గొండ సమీపంలోని ఆర్జాల వావి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని, ఆర్జాల బావి కోనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకె (100) మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. డిఎస్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డిఓలు, తహశీల్దార్లు, డిపిఎంలు, ఏపిఎంలు, సహకార శాఖ అసిస్టెంట్ సబ్ రిజి స్ట్రార్లు, మార్కెటింగ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులు ఈ టెలికాన్ఫరేన్స్‌లో పాల్గొన్నారు.

# వేలం పాటలో దుర్గామాత చీరను దక్కించుకున్న ముస్లింలు

- మత మౌఢ్యతకు పాతర... మతసామరస్యం చాటినందుకు పలువురి ప్రశంస

**తుంగతుర్తి, అక్టోబర్ 13 (మనం న్యూస్):** దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో దుర్గాష్టమి సంబరాల్లో భాగంగ నిర్వహించిన జరిగిన దుర్గమ్మ తల్లి చీర వేలం పాటలో ముస్లిం సోదరులు ఎండి సిద్ధిక్ భాష. ఆజం అలీ పాల్గొని చీరను 4100 కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో చాలామంది పోటీపడి వేలం హోరాహోరీగా సాగింది. చివరకు గ్రామానికి చెందిన ముస్లింలు వేలం పాటలో పాల్గొని అమ్మవారి చీరను దక్కించుకున్నారు. ఈ సంఘటన కులమత సామరస్యతకు ప్రత్యేకగా నిలవడంతో పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎండి సిద్ధిక్ భాష మాట్లాడుతూ భగవంతుడు సర్వంతర్యామి అని అన్నారు. దుర్గామాత కృప దేశ ప్రజల అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కుల మతాలకు అతీతంగా హిందూ ముస్లిం సోదరులు కలిసిమెలిసి ఉండాలని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. గతంలో పల్లెలో కులమతాలకతీతంగా ఒకరి పండుగలో ఒకరిని పిలుచుకుంటూ కలతలు లేని ప్రశాంత ఆరోగ్యకర జీవనాన్ని కొనసాగిస్తూ ఉండే వారు అలానే ఉంటూ మానవత్వాన్ని చాటుకుంటూ ఉండాలని ఆశాభావం వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు డాక్టర్ కుంచాల శ్రీనివాస్ రెడ్డి, సిపిఎం నాయకులు బుర్ర శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు దొంగరి గోవర్ధన్ ,అసనాబాద సత్యనారాయణ ,పోతరాజు ,రేగటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

- నల్గొండ అభివృద్ధికి బాగా కృషి చేస్తున్నారు
- ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను శంకుస్థాపన చేసిన మంత్రికి ధన్యవాదాలు
- డిసిసి అధికార ప్రతినిధి పాశం నరేష్ రెడ్డి



**నలగొండ, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి) :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి కొత్త పథకాన్ని నల్లగొండలో నెలకొల్పి, అభివృద్ధి ని పరుగులు పెట్టిస్తున్న రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు నల్లగొండలో శంకుస్థాపన చేసిన మంత్రి గారికి ధన్యవాదాలు. తన శాఖ రోడ్లు భవనాలు ద్వారానే కాకుండా, ప్రతి పథకాన్ని నల్లగొండ నియోజక వర్గానికి సాధిస్తున్నాడు. విద్యాభివృద్ధి కోసం ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిన విధంగా వేలకోట్ల రూపాయలు కేటాయించి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వము. కెసిఆర్ కేజీ టు పీజీ ఉచిత విద్య పథకాన్ని అమలు చేయలేకపోయాడు. విద్యార్థులు, యువకులు, నిరుద్యోగుల సంక్షేమం గురించి ఆలోచించే కాంగ్రెస్ పార్టీ విద్యాసంస్థలు నెలకొల్పుతున్నది. సంవత్సరాల తరబడి మరుగున పడిపోయిన డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు, ఇతర నోటిఫికేషన్ ల ద్వారా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసి నిరుద్యోగుల జీవితాలలో వెలుగులను నింపుతున్నది.నల్లగొండ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తాను అన్న కెసిఆర్ మాట ఉత్తిత్తి మాట అయింది.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తున్నారు.

# లతీఫ్ షా ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలి

- ఈనెల 17 నుండి ఉత్సవాలు ప్రారంభం
- నాలుగు రాష్ట్రాల నుండి భక్తుల రాక
- మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి

**నల్లగొండ, అక్టోబర్ 13 (మనం ప్రతినిధి):** గణనీయమైన చరిత్ర కలిగిన హజరత్ సయ్యద్ లతీఫ్ షా ఉల్లా ఖాద్రి ఉర్సు ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరించిన నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డిఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలకు పట్టణ ప్రజల కాకుండా దూర ప్రాంతాల నుంచి పాల్గొంటారు కావున ప్రజలకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా లోటుబాట్లు లేకుండా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని దర్గా కమిటీని కోరారు.. ఉర్సు ఉత్సవాలకు అన్ని రకాల సదుపాయాలు మున్సిపాలిటీ కల్పిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నవీన్ గౌడ్, ఇబ్రహీం, సయ్యద్ సమద్, మరియు ఉర్సు కమిటీ సభ్యులు ఇంతియాజ్ హుస్సేన్ చాన్ భాయ్,జియా, సయ్యద్ ఇర్ఫాన్, ఇనందర్ ముతవల్లీలు.. సయ్యద్ సమీవుల్లా ఖాద్రి, సయ్యద్ గౌస్ ఉల్లాఖాద్రి, సల్మాన్ ఖాద్రి, సయ్యద్ ఉబేద్ ఖాద్రి, తబరేజ్ ఖాద్రి, తదితరులు, దర్గా కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



## యువత క్రీడలో రాణించాలి

- క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంచడానికి కృషి చేస్తా
- సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్ యాదవ్



**మర్రిగూడ, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** విద్యార్థులు, యువత అభిరుచి గల రంగాల్లో పాల్గొని రాణించాలని సామాజిక కార్యకర్త, యువజన నాయకుడు వల్లంలో సంతోష్ యాదవ్ అన్నారు. ఆదివారం విజయదశమి దసరా పండుగ సందర్భంగా గ్రామంలో ముత్యాలమ్మ రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంటును నిర్వహించారు. టోర్నమెంట్లో ప్రథమ గెలుపొందిన. మాచర్ల హనుమంతు టీం కు.. 11,116 రూపాయలు, ద్వితీయ బహుమతి గెలుపొందిన శోభన్ టీంకు 5116 రూపాయల నగదును బహుమతి ని సంతోష్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు క్రీడాకారుల మధ్య స్నేహభావాన్ని ఐకామత్యాన్ని పెంచుతాయని అన్నారు. గెలిచినవారు మరిన్ని విజయాలను అందుకోవాలని ఓడినవారు ఓటమిని స్పూర్తిగా తీసుకొని విజయాన్ని అందుకోవాలని కోరారు. క్రీడలు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే కాకుండా స్నేహభా వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అమ్మవారి పట్టు చీర కైవసం చేసుకున్న సాయికృష్ణ



**నాగార్జున సాగర్, అక్టోబర్ 13 (మనం న్యూస్):** నాగార్జునసాగర్ పైలాన్ టీఎస్ జెన్కో నైన్ హెచ్ కాలనీ ఆవరణలో శరన్నవరాత్రి లో భాగంగా ధనలక్ష్మి అవతారంలో అమ్మవారికి అలంకరించిన పట్టు చీరను విజయదశమి రోజున వేలంపాటలో కైవసం చేసుకున్న సిహెచ్ సాయికృష్ణ సీనియర్ జర్నలిస్ట్ కీ టిఎస్ జెన్కో సూపరిండెంట్ ఇంజనీర్ రఘురాం దంపతుల చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీఎస్ జెన్కో సూపరిండెంట్ ఇంజనీర్ రఘురాం మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగ అన్నారు. ఎల్లవేళలా ప్రజలందరు సంతోషంగా ఉండే విధంగా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు మరియు అశేష భక్తులు పాల్గొన్నారు.


## ఎంబీబీస్ విద్యార్థికి అభినందనలు

- మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న



**చండూరు, అక్టోబర్ 13 (మనం న్యూస్):** చండూరు మండలం నేర్మట గ్రామానికి చెందిన నాగిళ్ళ శంకర్ కుమారుడు ప్రతిమ కాలేజ్ కరీంనగర్ లో ఇటీవల వెలువడిన ఎంబీబీఎస్ నీట్ కౌన్సిలింగ్ లో సీటు సాధించిన సందర్భంగా వారిని తన నివాసానికి పిలిచి శాలువాలతో సన్మానించి వారి కుటుంబ సభ్యులకు దసరా శుభాకాంక్షలు తెలిపి అభినందించిన చండూరు మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న ఈ కార్యక్రమంలో రాపోలు ప్రభాకర్, సంగెపు మల్లేష్, సందీప్, పవన్ సాయి, అన్నెపర్తి మల్లేష్, ఇతరులు పాల్గొన్నారు.

## దువాయిలను నాలుగో తరగతి ఉద్యోగులుగా పరిగణించాలి



**తిరుమలగిరి, అక్టోబర్ 13 (మనం న్యూస్) :** మార్కెట్ లలోదువాయిలుగా పనిచేస్తున్నారని నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ మెంబర్ సంకేపల్లి సుధీర్ రెడ్డి కి తెలంగాణ రాష్ట్ర వేమెన్ (దడవాయి) యూనియన్ ఉపాధ్యక్షులు గంజి సోమలింగం, వినతిపత్రం అందజేశారు. మార్కెట్ రాష్ట్ర వేమెన్ సమస్యను వివరించారు. మాకు రావలసిన పీస్ వర్క్ ఆదాయమును ప్రభుత్వమే వసూలు చేసుకుంటుందని, మాకు నెలవారీగా చెల్లించాలని కోరారు. సుధీర్ రెడ్డి ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మనం



## ముంబై ఇండియన్స్‌కు కొత్త కోచ్.. టీ20 వరల్డ్ కప్ విజేత వచ్చేశాడు!



ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ సిబ్బందిలో భారీ మార్పులు చేసింది. కొత్త ప్రధాన కోచ్తో పాటు బౌలింగ్ కోచ్ను నియమించింది. 2017 నుంచి 2022 వరకు పనిచేసిన మాజీ కోచ్ మహేలా జయవర్ధనెకు తిరిగి హెడ్ కోచ్గా బాధ్యతలు అందించింది. మార్క్ బౌచర్ స్థానంలో జయవర్ధనెను నియమిస్తున్నట్లు ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. 47 ఏళ్ల శ్రీలంక మాజీ కెప్టెన్ మహేలా జయవర్ధనె 2022 నుంచి కూడా ముంబై ఫ్రాంచైజీలోనే కొనసాగాడు. గ్లోబల్ హెడ్ ఆఫ్ క్రికెట్గా ముంబై ఫ్యామిలీలోనే ఉన్నాడు. ముంబై ఇండియన్స్ న్యూయార్క్ లీగ్, ముంబై ఇండియన్స్ ఎమిరేట్స్ తరఫున, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్లో ముంబైకు కోచింగ్ స్టాఫ్గా టైటిళ్లు అందించాడు. కాగా, కోచ్గా మార్క్ బౌచర్ హయాంలో ముంబై జట్టులో భారీ మార్పులు సంభవించాయి. రోహిత్ శర్మకు బదులుగా హార్దిక్ పాండ్యను కెప్టెన్గా నియమించారు. అయితే గత సీజన్లో ఈ నిర్ణయం జట్టు ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపించింది. పాయింట్ల పట్టికలో ముంబై అట్టడుగన నిలిచింది. మరో రెండు వారాల్లో రిటైన్ లిస్టు ప్రకటించినున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ యాజమాన్యం కోచింగ్ బాధ్యతలు జయవర్ధనెకు తిరిగి అప్పగించడం గమనార్హం. కాగా, ముంబై ఫ్యామిలీలో మార్క్ బౌచర్ సభ్యుడిగా కొనసాగుతాడని ముంబై ఇండియన్స్ పేర్కొంది. ''ముంబై ఇండియన్స్‌కు మహేలా జయవర్ధనె తిరిగి కోచ్గా రావడం సంతోషంగా ఉంది. గ్లోబల్ టీమ్లలో జరిగిన పరిణామాలతో అతను తిరిగి ముంబై ఇండియన్స్‌కు వచ్చాడు. అతని నాయకత్వ లక్షణాలు, జ్ఞానం, ఆటపై ఉన్న అభిమానం ముంబై ఇండియన్స్‌కు ఎప్పుడూ ప్రయోజనకరంగానే ఉంటుంది. గత రెండు సీజన్లలో గొప్ప సేవలు అందించిన మార్క్ బౌచర్‌కు కృతజ్ఞతలు. ముంబై ఇండియన్స్ ఫ్యామిలీలో అతను సభ్యుడిగా కొనసాగుతాడు'' అని ముంబై ఇండియన్స్ పేర్కొంది. కాగా, టీ20 వరల్ కప్-2024లో భారత జట్టును విజేతగా నిలపడంతో కీలక పాత్ర పోషించిన బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే కూడా తిరిగి ముంబై ఫ్రాంచైజీలో చేరనున్నాడు. బౌలింగ్ కోచ్గా మాంబ్రే బాధ్యతలు అందుకో నున్నాడు. టీ20 వరల్ కప్ ముగిసిన అనంతరం టీమిండియా ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్ రాజస్థాన రాయల్స్లో చేరిన సంగతి తెలిసిందే. తాజాగా బౌలింగ్ కోచ్ ముంబైతో జత కట్టాడు.

# భారత్ రికార్డ్ విజయం.. సిరీస్ కైవసం




బంగ్లాదేశ్తో మూడు టీ20ల సిరీస్‌ను కూడా టీమిండియా క్లీన్ స్వీప్ చేసింది. ఉప్పల్ వేదికగా శనివారం జరిగిన ఆఖరి టీ20లో సమష్టిగా రాణించిన టీమిండియా 133 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లో 6 వికెట్లకు 297 పరుగుల భారీ స్కోర్ చేసింది. సంజూ శాంసన్(47 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్స్‌లతో 111) విధ్వంసకర సెంచరీతో చెలరేగగా.. సూర్యకుమార్ యాదవ్(35 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 75) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. చివర్లో రియాన్ పరాగ్( 13 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 34), హార్దిక్ పాండ్యా(18 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 47) మెరుపులు మెరిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో తంజిమ్ హసన్ షకీబ్ మూడు వికెట్లు తీయగా.. ముస్తాఫిజుర్ రెహ్మాన్, మహ్మదుల్లా, టస్కిన్ అహ్మద్ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులే చేసి ఓటమిపాలైంది. టౌహిడ్ హృదయ్(42 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 63 నాటౌట్) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. లిటన్ దాస్(25 బంతుల్లో 8 ఫోర్లతో 42) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో రవి బిష్ణోయ్ మూడు వికెట్లు తీయగా.. మయాంక్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు. వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి తలో వికెట్ తీసారు.

### గోల్డెన్ డక్‌తో..

298 పరుగుల భారీ లక్ష్యచేధనకు దిగిన బంగ్లాదేశ్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. ఇన్నింగ్స్ తొలి బంతికే బంగ్లాదేశ్ ఓపెనర్ పర్వేజ్ హొస్సేన్ (0) గోల్డెన్ డక్గా వెనుదిరిగాడు. మయాంక్ యాదవ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔటయ్యాడు. ఆ కాసేపటికే దూకుడు కనబర్చిన తంజిద్ హసన్ (15)ను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేయగా.. కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో (14)ను రవి బిష్ణోయ్ పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి లిటన్ దాస్ రాగా.. పవర్ ప్లేలో బంగ్లాదేశ్ 3 వికెట్లకు 59 పరుగులు చేసింది.

టౌహిడ్ హృదయ్, లిటన్ దాస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. వీలుచిక్కిన బంతిని ఈ జోడీ బౌండరీకి తరలించింది. క్రీజులో సెట్ అయ్యేందుకు ప్రయత్నించిన ఈ జోడీని రవి బిష్ణోయ్ విడదీసాడు. హాఫ్ సెంచరీకి చేరువైన లిటన్ దాస్(42)ను క్యాచ్ ఔట్గా పెవిలియన్ చేర్చాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 53 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

### టౌహిడ్ హాఫ్ సెంచరీ..

ఆ కాసేపటికే మహ్మదుల్లా(8)ను మయాంక్ యాదవ్ ఔట్ చేయగా.. మెహ్ది హసన్ను నితీష్ కుమార్ రెడ్డి, రిషద్ హొస్సేన్‌ను రవి బిష్ణోయ్ పెవిలియన్ చేర్చారు. ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరోవైపు టౌహిడ్ హృదయ్ 35 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి విజయలాంఛనాన్ని పూర్తి చేశారు.



## బాబర్ అజామ్‌తో సహా నలుగురు స్టార్లపై వేటు..

### జట్టును ప్రకటించిన పాక్




ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు సాధించి కూడా ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓటమిపాలవ్వడంతో.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రక్షాళన చేపట్టింది. ఇంగ్లండ్తో జరగనున్న రెండు, మూడు టెస్టులకు స్టార్ క్రికెటర్లపై వేటు వేస్తూ జట్టును ఆదివారం ప్రకటించింది. స్టార్ ప్లేయర్, మాజీ కెప్టెన్ బాబర్ అజామ్‌ను జట్టు నుంచి తప్పించింది. బాబర్ అజామ్‌తో పాటు అనుభవజ్ఞులైన షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, సర్ఫరాజ్ అహ్మద్‌లను పాక్ సెలక్షన్ కమిటీ జట్టు నుంచి తప్పించింది. అన్‌క్యాప్డ్ ప్లేయర్లు హసీబుల్లా, మెహ్రాన్ ముంతాజ్, కమ్రాన్ గుహ్లామ్లతో పాటు ఫాస్ట్ బౌలర్ మహ్మద్ అలీ, ఆఫ్ స్పిన్నర్ సజీద్ ఖాన్లకు అవకాశం ఇచ్చింది. షాన్ మసూద్ సారథ్యంలో 16 మందితో కూడిన జట్టును పాక్ బోర్డు ప్రకటించింది. తొలి టెస్టు ఓటమి అనంతరం పాకిస్థాన్ టెస్టు కెప్టెన్ షాన్ మసూద్, కోచ్ గిలెస్పీ బాబర్ అజామ్‌కు మద్దతు ఇచ్చారు. కానీ సెలక్షన్ కమిటీలో మిగిలిన సభ్యులు బాబర్ అజామ్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సెలక్షన్ కమిటీలో సభ్యులు అలీందార్, ఆఖిబ్ జావెద్, అజర్ అలీలు బాబర్‌ను తప్పించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. 2022 డిసెంబర్ తర్వాత నుండి బాబార్ అజామ్ టెస్టుల్లో కనీసం హాఫ్ సెంచరీ కూడా చేయలేదు. ముల్తాన్ వేదికగా జరిగిన ఫ్లాట్ పిచ్‌పై కూడా రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 35 పరుగులే చేశాడు. 2022 నుంచి 10 టెస్టులు ఆడిన బాబర్ 27.73 సగటుతో 527 పరుగులు చేశాడు. ఓవరాల్గా 55 టెస్టుల్లో 43.92 సగటుతో 3997 పరుగులు చేశాడు. కాగా, బాబర్ అజామ్ ఇటీవల పరిమిత ఓవర్ల ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే.

### ఇంగ్లండ్తో 2,3 టెస్టులకు ఎంపికైన పాకిస్థాన్ జట్టు:


షాన్ మసూద్ (కెప్టెన్), సౌద్ షకీల్ (వైస్ కెప్టెన్), అమీర్ జమాల్, అబ్దుల్లా షఫీక్, హసీబుల్లా (వికెట్ కీపర్), కమ్రాన్ గులామ్, మెహ్రాన్ ముంతాజ్, మీర్ హమ్జా, మహ్మద్ అలీ, మహ్మద్ హురైరా, మహ్మద్ రిజ్వాన్ (వికెట్ కీపర్), నోమన్ అలీ, సయిమ్ అయుబ్, సాజిద్ ఖాన్, సల్మాన్ అలీ అఘా, జాహిద్ మెహమూద్.

## క్రిస్మస్‌కు వస్తున్న ప్రియదర్శి సారంగపాణి జాతకం





టాలీవుడ్ దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి, బలగం నటుడు ప్రియదర్శి కాంబోలో ఒక సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. 'సారంగపాణి జాతకం' అంటూ ఈ సినిమా రాబోతుండగా.. మోహన కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో వచ్చిన జెంటిల్ మన్, 'సమ్మోహనం, చిత్రాలు నిర్మించిన శ్రీదేవి మూవీస్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్ విడుదల చేయగా.. ఆకట్టుకుంది. అయితే దసరా కానుకగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు మేకర్స్. ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా.. డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రంలో రూప కొడువాయూర్ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాని శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తుండగా.. వి.కె. నరేష్. తనికెళ్ళ భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, ప్రదీప్ రుద్ర, రమేష్ రెడ్డి, కల్పలత, రూపలక్ష్మి, హర్షిణి , కె.యల్.కె. మణి కీలక పాత్రలలో నటిస్తున్నారు.

## నారా రోహిత్ నిశ్చితార్థం..



నటుడు నారా రోహిత్ త్వరలో ఓ ఇంటి వాడు కాబోతున్నాడు. ఆయనకు కళ్యాణ ఘడియలు వచ్చేశాయి. ప్రతినిధి 2 హీరోయిన్ సిరిలెల్లతో నారా రోహిత్ పెళ్లి జరగనుంది. అయితే ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో నారా రోహిత్ నిశ్చితార్థ వేడుక జరిగింది. ఈ వేడుకకు ఏపీ సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, సిరిలెల్ల కుటుంబ సభ్యులతో పాటు ఇరు కుటుంబాలకు చెందిన అత్యంత సన్నిహితులు హాజరయ్యారు. నిశ్చితార్థం అనంతరం నారా రోహిత్, సిరిలెల్లకు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు చెప్పారు. ఇక రోహిత్, సిరిలెల్ల ఎంగేజ్‌మెంట్‌కు చెందిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చంద్రబాబు తమ్ముడి కుమారుడే నారా రోహిత్. ఈయన 'బాణం' సినిమాతో టాలీవుడ్లోకి అడుగుపెట్టారు. ఈ ఏడాది నారా రోహిత్ హీరోగా నటించిన 'ప్రతినిధి 2' విడుదలై ప్రేక్షకులను అలరించింది. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే నటి సిరితో రోహిత్‌కు ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగుపెడుతున్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన నటుడు చిరంజీవి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని నటుడు చిరంజీవి శనివారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా దసరా శుభాకాంక్షలు తెలిపి.. వరద సాయం చెక్కును ఏపీ సీఎం చంద్రబాబుకు చిరంజీవి అందజేశారు. సీఎంఆర్ఎఫ్‌కు చిరంజీవి రూ. కోటి విరాళం అందించారు. చిరంజీవి తరపున రూ. 50 లక్షల చెక్కును, రామ్‌చరణ్ తరపున రూ. 50 లక్షల చెక్కును చంద్రబాబుకు చిరంజీవి అందించారు. ఈ భేటీ హైదరాబాద్లోని చంద్రబాబు నివాసంలో జరిగింది. ఇటీవలి వరదలకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు చాలా ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయాయి. బుడమేరు ఉద్ధృతితో విజయవాడ నగరం ముంపునకు గురైంది. ముంపు బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. వరద బాధితులకు ఆర్థిక సాయం అందిస్తుంది.

తాను షేర్ చేసిన ఓ వీడియోకు వస్తోన్న విమర్శలపై నటి అనన్య నాగళ్ల స్పందించారు. ఎందుకింత నెగటివిటీ అంటూ తన అసహనాన్ని వ్యక్తంచేశారు. ''ప్లాస్టిక్ వాడకం తగ్గించమని ఇటీవల నేనొక వీడియో షేర్ చేశా. దాన్ని కొందరు తప్పుబట్టారు. విమర్శలు చేశారు. చిన్న విషయం చెప్పా. నచ్చితే చేయండి.. లేకపోతే లేదు. ఎందుకింత నెగటివిటీ?'' అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్గా మారింది. సోషల్‌మీడియాలో ఎంతో యాక్టివ్గా ఉండే అనన్య.. ఇటీవల ఓ వీడియో షేర్ చేశారు. ఇందులో ఆమె స్ట్రా సాయం లేకుండా కొబ్బరిబొండాం నీళ్లు తాగుతూ కనిపించారు. ''సాధారణంగా నేను స్టీల్ స్ట్రా వెంట తెచ్చుకుంటాను. అది లేని పక్షంలో ఈ విధంగా కొబ్బరినీళ్లు తాగుతా. ప్లాస్టిక్ వాడకాన్ని కాస్త తగ్గిద్దాం. చిన్న చిన్న పనులే పెద్ద మార్పులకు శ్రీకారం చుడతాయి'' అని రాసుకొచ్చారు. దీనిని చూసిన పలువురు నెటిజన్లు ఆమె అభిప్రాయాన్ని తప్పుబట్టారు. ''మీ పక్కన ఉన్న ఆవిడకు ముందు చెప్పండి. ఆమె స్ట్రాతో తాగుతున్నారు'' అని కామెంట్స్ చేశారు. ఆమె నటించిన 'పొట్టేల్' విడుదలకు సిద్ధంగా ఉంది. అక్టోబర్ 25న విడుదల కానుంది.

## నచ్చితే చేయండి.. లేకపోతే లేదు



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.